

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | గురువారం 16-04-2026 | సంపుటి - 27 | సంచిక -324 | రూ : 4 | పేజీలు: 8


# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగల్

- ఒకట్రెండు రోజుల్లో జీవో
- మీనాక్షి నటరాజన్‌తో భేటీలో సీఎం నిర్ణయం
- పీఏసీ సమావేశాన్ని ఏర్పాటు చేయాలంటూ పీసీసీ చీఫ్‌నకు విజ్ఞప్తి

హైదరాబాద్ : అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, తరువాయి 2లో





## హైదరాబాద్ సహా పలు జిల్లాలకు
# వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

- తెలంగాణలో పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు
- రానున్న మూడు రోజుల్లో ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం
- వడగాలులు వీచే జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.


## దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం 2లో



## హార్ముజ్‌ను తెరుస్తున్నాం

- చైనా కోసం...ప్రపంచం కోసమే : ట్రంప్
- ఇరాన్ యుద్ధం ముగియబోతోంది
- రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు
- వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ 2లో






# మహిళలు వర్సెస్ సీట్లు

- హడావిడిగా రిజర్వేషన్ చట్టం
- అమలుకు బీజేపీ యత్నం
- కీలకంగా మారిన మహిళా ఓటు బ్యాంకు

న్యూఢిల్లీ : రేపటి నుంచి (ఏప్రిల్ 1618) పార్లమెంటు సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశా లకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్న, అమలుకు నోచుకుని చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టాన్ని (నారీ శక్తి వందన్ అధినియమ్) మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. బహుశా మెజార్టీ ఉంది గనుక అమల్లోకి తెస్తుంది. ఇది మంచి విషయమే. కానీ మహిళాభివృద్ధి కోసం పాటుపడే పార్టీ అయితే శభాష్ తరువాయి 2లో

## సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు
## గతేడాది కంటే పెరిగిన ఉత్తీర్ణత

- సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాలు విడుదల
- 93.70 శాతంగా నమోదైన ఉత్తీర్ణత
- గతేడాది కంటే స్వల్పంగా పెరిగిన పాస్ పర్సంటేజ్
- 95 శాతానికి పైగా మార్కులు సాధించిన 55 వేల మంది విద్యార్థులు
- సుమారు 1.47 లక్షల మందికి కంపార్ట్‌మెంట్ అవకాశం

2లో



## ట్రంప్ ఎఫెక్ట్: భారత్‌కు పోటెత్తుతున్న ఇరాన్ చమురు

- దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు రాక
- పారాదీప్, సిక్కాలలో చమురు అన్‌లోడింగ్
- ఇరాన్‌పై ఆంక్షల ఎత్తివేత గడువు త్వరలో ముగింపు

2లో





## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..
## ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం

- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం

2లో

## భారత్‌లో తొలిసారి..
## హైదరాబాద్‌లో
## యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్

2లో



# దక్షిణాదికి అన్యాయం చేస్తే పెను ఉద్యమం

హైదరాబాద్ : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పేరుతో దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా అన్యాయం చేస్తే పెను ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) కేంద్ర ప్రభు త్వాన్ని హెచ్చరించారు. బుధవారం ఆయన ఎక్స్ ద్వారా ట్వీట్ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే అది కేవలం రాజకీయ ప్రక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదనీ, మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. మూడేండ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమనీ, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని పేర్కొన్నారు. జనాభా నియంత్రణతోపాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు. దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రాతినిధ్యాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని కోరారు. "ఢిల్లీ పాలకులు తమ మాట వినాలనీ, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నట్టు తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ మొదటి నుంచి చిత్తశుద్ధితో సంపూర్ణ మద్దతు ఇస్తోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడమే కాకుండా, అసెంబ్లీ, శాసన మండలిలో ఏకగ్రీవ తీర్మానాలు కూడా చేసిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు, మార్కెట్ కమిటీల్లో 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం ద్వారా మహిళా సాధికారత పట్ల తమకున్న అచంచలమైన నిబద్ధతను చాటుకున్నామని వివరించారు. మహిళా రిజర్వేషన్లను నియోజక వర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణ లతో ముడిపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అత్యంత సరళమైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు సంక్లిష్టం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలనీ, పార్లమెంటులో 543 సీట్లు ఉన్నాయనీ, వాటికి వర్తింపజేయాలని సూచించారు. తెలంగాణలో 119 అసెంబ్లీ స్థానాలున్నాయనీ, ఇక్కడ కూడా అమలు చేయాలని కోరారు. సీట్ల పెంపు పునర్విభజనతో ముడిపెట్టి ఎందుకు అయోమయాన్ని సృష్టిస్తున్నారని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. రాజ్యాంగ విధివిధానాల ప్రకారం మొదట జనగణన, తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఆ తర్వాతే నిర్మాణాత్మక మార్పులు జరగాలని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనా లకు విఘాతం కలగని ఏ సహేతుకమైన ప్రతి పాదనకైనా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. దక్షిణాదికి అన్యాయం చేస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామనీ, అవసరమైతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# 'కుల కార్పొరేషన్ల' భర్తీకి గ్రీన్‌సిగల్

హైదరాబాద్ : అధికార పార్టీలోని ఆశావహులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న కార్పొరేషన్ చైర్మెన్లు, పాలక మండళ్లకు సంబంధించిన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఒకట్రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. కాకపోతే ప్రస్తుతానికి నాయిబ్రాహ్మణ, పద్మశాలి, రజక తదితర కులాలకు చెందిన కార్పొరేషన్లలోని పోస్టులనే భర్తీ చేయనున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో సీఎం బుధవారం కీలక సమావేశాన్ని నిర్వహించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో దాదాపు నాలుగు గంటలపాటు వారు పలు అంశాలపై చర్చించారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌లు, కార్యదర్శులు, ఇతర ఆర్గనైజర్ల పోస్టుల భర్తీపై కూడా వారు సమాలోచనలు చేసినట్టు తెలిసింది. మండల, బూత్ లెవల్ కమిటీల ఏర్పాటుపై సైతం వారు చర్చించారు. కేంద్రం చేపడుతున్న నియోజకవర్గాల పునర్ విభజన, రాష్ట్రానికి జరగబోయే నష్టం గురించి ఈ సందర్భంగా సీఎం ప్రస్తావించారు. కాంగ్రెస్ సంస్థాగత విషయాలపై చర్చించి, నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా త్వరలోనే పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ)ని నిర్వహించాలంటూ ఆయన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా కార్పొరేషన్లతోపాటు పార్టీ పదవులను భర్తీ చేసేటప్పుడు క్రియాశీలకంగా ఉన్న జిల్లాలు, అక్కడి సామాజిక సమీకరణాలు, పార్టీ కోసం పనిచేసిన నేతలు తదితరాంశాలపై జాబితాను రూపొందించాలంటూ సీఎం సూచించారు. ఒక్కో ఆశవహుడి పేరును ప్రస్తావిస్తూ ఆయన చర్చించారు. 'ఒక్కరికి కేవలం ఒక పదవే...' అనే సూత్రాన్ని పక్కాగా, తూ.చా. తప్పకుండా పాటించాలంటూ కోరారు. ఇదే విధంగా భవిష్యత్ అవసరలను దృష్టిలో ఉంచుకుని సామాజిక సమీకరణాలు, పొందికలపై దృష్టి సారించాలని సమావేశంలో నిర్ణయించారు.

# మహిళలు వర్సెస్ సీట్లు

న్యూఢిల్లీ : రేపటి నుంచి (ఏప్రిల్ 1618) పార్ల మెంటు సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశా లకు చాలా ప్రత్యేకత ఉంది. ఎందుకంటే ఎన్నో ఏండ్ల నుంచి ఎదురుచూస్తున్న, అమలుకు నోచుకుని చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ చట్టాన్ని (నారీ శక్తి వందన్ అధినియమ్) మోడీ ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. బహుశా మెజార్టీ ఉంది గనుక అమల్లోకి తెస్తుంది. ఇది మంచి విషయమే. కానీ మహిళాభివృద్ధి కోసం పాటుపడే పార్టీ అయితే శభాష్ అనొచ్చు. కానీ మనువాద సిద్ధాంతాన్ని నెత్తికెత్తుకుని.. మహిళల్ని వంటింటి కుందేళ్లుగానే చూసే బీజేపీ ఇంతటి మహాత్కార్యానికి పూనుకోవడమే ఆశ్చర్యమేస్తోంది. ఆలోచనలో పడేస్తోంది. మహిళల విద్యకు, ఆర్థికంగా ఏమాత్రం ఊతమివ్వని కేంద్ర ప్రభుత్వం చట్టసభల్లో కూర్చోబెట్టడానికి ఎందుకింత తహతహలా డుతుందంటే.. కేవలం రాజకీయ లబ్ది కోసమేనన్నది బహిరంగ సత్యం.

*** బీజేపీకి కీలకమైన మహిళా ఓటు బ్యాంకు**

ఐదు రాష్ట్రాల ఎన్నికల సమయంలోనే కేంద్ర ప్రభు త్వం హడావిడిగా ఈ చట్టాన్ని ఎందుకు అమలు చేయ డానికి పూనుకుందంటే.. పశ్చిమ బెంగాల్, తమిళనా డులో గట్టెక్కడానికే. కేవలం ఈ ఎన్నికల్లో మాత్రమే కాదు.. బీజేపీకి గత ఎన్నికల్లో కూడా మహిళా ఓటు బ్యాంకు చాలా కీలకంగా మారింది. 2014 నుంచి 2024 సార్వత్రిక ఎన్నికల్ని పరిశీలిస్తే.. మహిళల ఓట్ల వల్లే బీజేపీ గెలిచిందనడంలో అతిశయోక్తి లేదు. నేషనల్ ఎలక్షన్ స్టడీస్ (ఎన్ఇఎస్) సమాచారం ప్రకారం.. 1998 ఎన్నికల్లో బీజేపీకి మహిళా ఓటింగ్ 33శాతం. అప్పుడు అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్‌కి 30 శాతమే. ఆ తర్వాత మళ్లీ బీజేపీకి మహిళా ఓటింగ్ తగ్గినా.. 2014 నుంచి క్రమేణా పెరుగుతోంది. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌కి 22శాతం మహిళా ఓటింగ్ అయితే.. బీజేపీకి 36 శాతం నమోదైందని ఎన్ఇఎస్ గణాంకాలే వెల్లడించాయి.

# హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరిక

ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, నిజామాబాద్, ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. రానున్న మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు క్రమంగా ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది. ఆయా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల మేర నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఈరోజు నిజామాబాద్, ఖమ్మం, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని, గురువారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీస్తాయని తెలిపింది. వడగాలులు వీచే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

# భారత్‌లో తొలిసారి.. హైదరాబాద్‌లో యూనివర్శిటీ ఆఫ్ లండన్ క్యాంపస్

హైదరాబాద్, ఏప్రిల్ 15 :హైదరాబాద్ నగరాన్ని గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'యూనివర్సిటీ ఆఫ్ లండన్' తమ తొలి భారతీయ ఆఫ్‌షోర్ క్యాంపస్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఐటీ, బయోటెక్ రంగాల్లో ఇప్పటికే అంతర్జాతీయ ఖ్యాతి పొందిన నగర కీర్తి కిరీటంలో ఈ పరిణామం మరో కలికితురాయిగా నిలవనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించ తలపెట్టిన భారత్ ఫ్యూచర్ సిటీలోని ఎడ్యుకేషన్ జోన్‌లో ఈ విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. దీని నిర్మాణం పూర్తయ్యే వరకు, నగరం నడిబొడ్డున ఉన్న లేక్ వ్యూ గెస్ట్ హౌస్‌ను తాత్కాలిక ప్రాంగణంగా వినియోగించుకోవడానికి ప్రభుత్వం అనుమతించింది. 202728 విద్యా సంవత్సరం నాటికి కోర్సులను ప్రారంభించే లక్ష్యంతో వర్సిటీ ప్రతినిధులు, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు (యూజీసీ) దరఖాస్తు ప్రక్రియను వేగవంతం చేశారు. 1836లో స్థాపించిన యూనివర్సిటీ ఆఫ్ లండన్, యూకేలోని అత్యంత పురాతన ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థల్లో ఒకటి. క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్‌లో టాప్500లోపు ఉన్న విదేశీ వర్సిటీలనే భారత్‌లో అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు ఇది పూర్తిస్థాయిలో అనుగుణంగా ఉంది. లండన్ బిజినెస్ స్కూల్, కింగ్స్ కాలేజ్ వంటి 17 ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల సమాఖ్యగా ఇది పనిచేస్తోంది. తెలంగాణను అన్ని రంగాల్లో గ్లోబల్ లీడర్‌గా నిలపాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనల మేరకు ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# హార్ముజ్‌ను తెరుస్తున్నాం

వాషింగ్టన్ : ప్రపంచ దేశాల కోసం హార్ముజ్ జలసంధిని శాశ్వతంగా తెరుస్తున్నానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. 'హార్ముజ్ జల సంధిని నేను శాశ్వతంగా తెరిచినందుకు చైనా చాలా సంతోషిస్తోంది. నేను చైనా కోసం... ప్రపంచం కోసం ఆ పని చేశాను. ఈ పరిస్థితి ఇకపై ఎన్నడూ ఉత్ప న్నం కాదు. ఇరాన్‌కు ఆయుధాలు పంపరాదని వారు అంగీకరించారు. కొన్నివారాల క్రితం నేను అక్కడికి వెళ్లినప్పుడు అధ్యక్షుడు జిన్‌పింగ్ నన్ను పెద్దగా, బలంగా హత్తుకున్నారు. మేము కలిసి పనిచేసుకుం టున్నాం' అని ట్రంప్ తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో రాసుకొచ్చారు. కాగా ఇరాన్‌కు ఆయుధాలు అందించవద్దని జిన్‌పింగ్‌కు లేఖ రాశా నని ట్రంప్ ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఇరాన్‌కు చైనా ఆయుధాలు అందిస్తోం దని తాను విన్నానని, అలా చేయవద్దని కోరుతూ లేఖ రాశానని చెప్పారు. తాను అలా చేయడం లేదని జిన్‌పింగ్ ప్రత్యుత్తరం ఇచ్చారని అన్నారు.

**ఇరాన్ యుద్ధం ముగియబోతోంది**

ఇరాన్‌పై మొదలు పెట్టిన యుద్ధం త్వరలోనే ముగియబోతోందని అమెరికా అధ్యక్షుడు చెప్పారు. యుద్ధాన్ని సైనిక చర్యతో ముగించబోవడం లేదని ఆయన తెలిపారు. ఇరాన్‌తో రెండో విడత చర్చలకు అమెరికా సిద్ధమవుతున్న వేళ ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. 'మాపని ఇంకా పూర్తి కాలేదు. మేము నిష్క్రమిస్తే ఇరాన్ పునర్నిర్మాణానికి 20 సంవత్సరాలు పడుతుంది. ఏం జరుగుతుందో చూద్దాం. ఒప్పందం చేసుకోవాలని వారు బలంగా కోరుకుంటున్నారని నేను అనుకుంటున్నాను' అని ట్రంప్ చెప్పారు. ఫాక్స్ బిజినెస్ ప్రతినిధితో ట్రంప్ బుధవారం మాట్లాడుతూ ఇరాన్‌పై ప్రత్యక్ష దాడి చేయాలన్న తన నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. ఇరాన్ అణు సామర్థ్యాన్ని నిర్మూలించడానికి ఆ చర్య అవసరమని అన్నారు. 'నేను ఆ పనిచేయకపోతే ఇరాన్ వద్ద ఇప్పటికే అణ్వాయుధం ఉండేది. ఒకవేళ వారి వద్ద అణ్వాయుధం ఉంటే మీరు వారిని సర్ అని వినయంగా పిలవాల్సి వచ్చేది. అలా జరగాలని ఎవరూ కోరుకోరు' అని ట్రంప్ చెప్పారు. అలాగే పదివేల మందితో యూఎస్ బలగాలు పశ్చిమాసియాలో మకాం వేసి ఉన్నట్టు తెలిపారు.

*** హార్ముజ్‌లో నౌకల రవాణాను అనుమతించండి : అమెరికాను కోరిన సౌదీ**

హార్ముజ్ జలసంధి మూసివేత నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఇరాన్‌తో చర్చలు జరపాలని అమెరికా ప్రభుత్వాన్ని సౌదీ అరేబియా కోరింది. లేకుంటే ప్రాంతీయ, ఆర్థిక సంక్షోభం తీవ్రతరమవుతుందని హెచ్చరించింది. హార్ముజ్ మూసివేతకు ప్రతీకారంగా గల్ఫ్‌కు ఆవల ఇరాన్ దాడులు చేయవచ్చునని, ఇతర కీలక సముద్ర మార్గాలను అడ్డుకోవచ్చునని అరబ్ అధికారులు వాషింగ్టన్ పోస్ట్ పత్రికకు తెలియజేశారు. సౌదీ అరేబియాలోని కీలక బాబ్ అల్‌మండెబ్ జలసంధిని ఇరాన్ లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉన్నదని సౌదీ ఆందోళన చెందుతోంది. ఎర్ర సముద్రంలోని ఈ జలసంధి ద్వారానే సౌదీ నుంచి చమురు ఎగుమతులు ఎక్కువగా జరుగుతుంటాయి. బాబ్ ఎల్ మండెబ్‌ను మూసివేయాలని ఇరాన్ అనుకుంటే హౌతీలు జత కలుస్తారని యెమన్ నిపుణుడు ఆడం బరన్ చెప్పారు. గాజా ఘర్షణ సమయంలో హౌతీలు తమ సామర్థ్యాన్ని ప్రదర్శించారని ఆయన గుర్తు చేశారు.

*** రెండో విడత చర్చలకు దౌత్య యత్నాలు వాషింగ్టన్‌లో ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల భేటీ**

అమెరికా, ఇరాన్ మధ్య రెండో విడత చర్చల కోసం ఇస్లామాబాద్‌లో దౌత్యవేత్తలు తీవ్ర ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇరాన్ ఓడరేవులను దిగ్బంధిస్తానని అమెరికా చేసిన హెచ్చరిక, దానికి ప్రతిగా మధ్యప్రాచ్యం అంతటా లక్ష్యాలపై దాడులు చేస్తానని ఇరాన్ చేసిన ప్రకటన నేపథ్యంలో రెండో విడత చర్చలపై ఉత్కంఠ నెలకొంది. రాబోయే రెండు రోజులలో ఇరాన్‌తో సంప్రదింపులు జరుగుతాయని, వాటికి ఇస్లామాబాదే వేదిక అని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. చర్చలు తిరిగి ప్రారంభమయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా చెప్పారు. పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు. ఇదిలావుండగా దశాబ్దాల విరామం తర్వాత తొలిసారిగా ఇజ్రాయిల్, లెబనాన్ రాయబారుల మధ్య వాషింగ్టన్‌లో చర్చలు జరిగాయి. ఇవి మంచి ఫలప్రదంగా సాగాయని అమెరికా విదేశాంగ శాఖ చెప్పింది. ఉగ్రవాద హెజ్బొల్లా గ్రూపు నుంచి లెబనాన్‌కు విముక్తి కల్పించాలని ఇరు పక్షాలు అభిప్రాయ పడ్డాయని ఇజ్రాయిల్ రాయబారి ఎచిల్ లైటర్ తెలిపారు. సమావేశం నిర్మాణాత్మకంగా జరిగిందని లెబనాన్ రాయబారి నాదా హమదే V-- మొవాద్ అన్నారు. అయితే ఇజ్రాయిల్, హెజ్బొల్లాల మధ్య జరుగుతున్న ఘర్షణకు ముగింపు పలకాలని ఆయన కోరారు.

*** రష్యా నుంచి పెరిగిన ఇంధన దిగుమతులు**

పశ్చిమాసియా యుద్ధం, అంతర్జాతీయ ఇంధన సరఫరాలలో ఏర్పడిన ఆటంకాల నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. గత నెలలో రష్యా నుంచి మన దేశం పెద్ద ఎత్తున ముడి చమురును కొనుగోలు చేసింది. తద్వారా భారత ఇంధన దిగుమతుల వ్యూహంలో మార్పులు జరిగాయి. మీడియా వార్తల ప్రకారం రష్యా నుంచి మార్చిలో మన దేశం రూ.58,229 కోట్ల విలువైన ముడి చమురును కొనుగోలు చేసింది. అంతర్జాతీయ చమురు ధరలు పెరుగుతున్న సమయంలో దిగుమతులు రెట్టింపుకు పైగా పెరగడం గమనార్హం. అంతర్జాతీయ పరిస్థితులకు అనుగుణంగా భారత్ తన ఇంధన వ్యూహాన్ని సర్దుబాటు చేసుకుంటోందని ఈ పరిణామం రుజువు చేస్తోంది. ఫిబ్రవరిలో రష్యా నుంచి ముడి చమురు కొనుగోలు పడిపోయిందని, అయితే అది మార్చిలో గరిష్ట స్థాయికి చేరుకున్నదని సెంటర్ ఫర్ రిసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్ఈఏ) సంస్థ తెలిపింది. గత నెలలో రష్యా నుంచి శిలాజ ఇంధనాలను కొనుగోలు చేసిన దేశాలలో భారత్ రెండో స్థానంలో నిలిచింది. వీటిలో 91 శాతం వాటా ముడి చమురుదే. దీనితో పాటు బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులను కూడా భారత్ కొనుగోలు చేస్తోంది.

*** 19 వరకే ఇరాన్ చమురు అమ్మకాలు గడువు పొడిగించం : అమెరికా**

సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ నౌకలలో ఉన్న చమురును విక్రయించుకునేందుకు ఇచ్చిన గడువును పొడిగించే ప్రశ్నే లేదని అమెరికా స్పష్టం చేసింది. ఇరాన్ చమురు నౌకల ప్రయాణానికి అమెరికా ఈ నెల 19వ తేదీ వరకూ తాత్కాలిక వెసులుబాటు ఇచ్చింది. దానిని పొడిగించే ఉద్దేశం లేదని, ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగిస్తామని ట్రంప్ ప్రభుత్వం తెలిపింది. ఇరాన్ ఇంధన ఎగుమతులకు ఈ నెల 19వ తేదీ వరకూ ఇచ్చిన వెసులుబాటును పొడిగించే ఉద్దేశం లేదని అమెరికా ఆర్థిక మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో తెలియజేసింది. అంతేకాక కఠినతరమైన నిబంధనలను విధించబోతున్నామంటూ అంతర్జాతీయ ఆర్థిక సంస్థలకు సంకేతాలు పంపింది. అందుబాటులో ఉన్న అన్ని అధికారాలు, సాధానాలను పూర్తి స్థాయిలో ఉపయోగించుకుంటా మని చెప్పింది. ఇరాన్ లావాదేవీలను కొన సాగించే విదేశీ బ్యాంకులపై సెకండరీ ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొంది. ఇప్పటికే నౌకలలో నింపిన ఇరాన్ చమురును, పెట్రో కెమికల్ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు గత నెలలో అమెరికా అనుమతి ఇచ్చింది. యుద్ధ సమయంలో అంతర్జాతీయంగా సరఫరాల ఒత్తిడి తలెత్తకుండా చూసేందుకు గతంలో విధించిన ఆంక్షలను తాత్కాలికంగా ఎత్తివేసింది. దీంతో 140 మిలియన్ బ్యారల్స్ చమురు రవాణాకు మార్గం సుగమమైంది.

# సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం

శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రంప్ ఎఫెక్ట్: భారత్‌కు పోటెత్తుతున్న ఇరాన్ చమురు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 15 :పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో, ఇరాన్ నుంచి భారత్‌కు దాదాపు 4 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు వచ్చింది. సుమారు ఏడేళ్ల తర్వాత ఇరాన్ నుంచి భారత్ చమురును కొనుగోలు చేస్తోంది. యుద్ధం నేపథ్యంలో ఇరాన్ చమురుపై ఉన్న ఆంక్షలను అమెరికా ఇటీవల తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నెల 19న గడువు ముగియనుండగా, దీనిని పొడిగించేది లేదని అమెరికా స్పష్టం చేసింది. ట్రంప్ ప్రభుత్వం ఇరాన్ చమురుపై విధించిన గడువు ఈ వారాంతంలో ముగియనున్నందున, భారత్ వ్యూహాత్మకంగా అంతకుముందే టెహ్రాన్ నుంచి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఫిబ్రవరి చివరలో ప్రారంభమైన యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ప్రపంచ ఇంధన కొరత, ధరల స్థిరీకరణ కోసం అమెరికా రష్యా, ఇరాన్ ముడి చమురు కొనుగోళ్లకు తాత్కాలికంగా అనుమతించింది. దీనితో ఇరాన్ నుంచి భారత్ చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇరాన్ చమురుతో నిండిన అతిపెద్ద ముడి చమురు రవాణా నౌక 'జయ' ఇప్పటికే భారత తూర్పు తీరంలోని పారాదీప్ వద్ద సరుకును దింపుతోంది. మరో చమురు నౌక 'ఫెలిసిటీ' పశ్చిమ తీరంలోని సిక్కాలో చమురును అన్‌లోడ్ చేస్తోంది. ఈ రెండు నౌకల్లో 2 మిలియన్ బ్యారెళ్ల చమురు చొప్పున వచ్చింది. భారతదేశం అవసరాల కోసం ఇరాన్ నుంచి ముడి చమురును సేకరిస్తామని ఈ నెల ప్రారంభంలో భారత్ తెలిపింది. ఇదిలా ఉండగా, ఇరాన్‌లోని ఖర్గ్‌లో ముడి చమురు నింపుకున్న 'డెర్యా' నౌక భారతదేశ పశ్చిమ తీరంలో నిలిచి ఉంది. అయితే ఏ రేవుకు వెళ్లాలన్నదానిపై ఈ నౌక తదుపరి ఆదేశాల కోసం వేచి చూస్తున్నట్లు తెలుస్తోంది.

# ఊదరి నర్సింహ్మకు తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డు

* **డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల్లో అవార్డు అందజేత**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా దళిత వర్గానికి చేసిన సేవలు గుర్తించి ప్రభుత్వం దళితరత్న అవార్డులను అందిస్తోంది. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎస్సీ ఎస్టీ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తాళ్లసింగారం గ్రామానికి చెందిన ఊదరి నర్సింహ్మ తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డుకు ఎంపికయ్యారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రవీంద్ర భారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో జయంతి ఉత్సవాల కో చైర్మన్ లు దొమ్మాటి సుదర్శన్ బాబు, అల్లిబిల్లి మహేందర్ లు ఊదరి నర్సింహ్మకు తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఊదరి నర్సింహ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. కొన్ని సంవత్సరాలుగా పలు సామాజిక కార్యక్రమాలు చేపట్టడంతో పాటు అణగారిన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేశానని గుర్తు చేశారు. అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానని గుర్తు చేశారు. ప్రభుత్వం తనను గుర్తించి అవార్డు అందజేయడం జీవితంలో మర్చిపోలేని ఘట్టమన్నారు. తెలంగాణ రాష్ట్ర దళిత రత్న అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. భవిష్యతులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తానన్నారు. అవార్డు ఎంపికలో సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు





మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆల్ ఇండియా రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ 135 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్ ఎస్ ఈ మహబూబాబాద్ సెక్షన్ ఇంజనీర్ ఆఫీసర్ అలాం, ఎస్ ఎస్ ఈ సెక్షన్ ఇంజనీరింగ్ ఆఫీస్ సూపర్డెంట్ బాదావత్ రాజు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ హక్కుల కోసం, రిజర్వేషన్ల కోసం నిరంతరం శ్రమించిన గొప్ప మేధావి. ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ, అనగారిన వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా నేడు ఉద్యోగాలు గాని రాజకీయ చైతన్యం వచ్చిందంటే అది డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ద్వారానే గుర్తుంచుకోవాలి వారన్నారు.ఈ కార్యక్రమంలో ఆలిండియా ఎస్సీ, ఎస్టీ మహబూబాబాద్ బ్రాంచ్ సెక్రటరీ దాసరి హరికృష్ణ, వెంకటరత్నం, స్వామి, శ్రీనివాస్, కిన్నెర కృష్ణ, లక్ష్మి, బాబురావు, ప్రతాప్ ,సతీష్, బిక్షపతి, డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపురంలో ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్ ప్రారంభం



భువనగిరి ప్రతినిధి , ప్రజాస్ఫూర్తి : మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో బుధవారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి ధాన్యం కొనుగోలు సెంటర్ ను కొండాపురం గ్రామ సర్పంచ్ జిల్లా సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు కొప్పుల వెంకట్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు . కొనుగోలు కేంద్రాలలో నిర్వాహకులు రైతులకు మంచినీరు గని బ్యాగులు టార్పిన్ కవర్లు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో తాహిసిల్దార్ కే రాజేంద్ర ప్రసాద్, ఏపిఎం ఆనంద్, ఉపసర్పంచ్ మహేందర్ రెడ్డి, వార్డ్ మెంబర్లు మహిళా సంఘం సభ్యులు, రైతులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## అరైవ్–అలైవ్‌తో రహదారి భద్రతపై చైతన్యం

* **టూ టౌన్ పరిధిలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు**




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో "అరైవ్-అలైవ్" కార్యక్రమం కింద టూ టౌన్ పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా టూ టౌన్ సీఐ డి. ప్రతాప్ మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ వినియోగించాలనే విషయాన్ని విద్యార్థులు తమ కుటుంబ సభ్యులకు గుర్తుచేయాలని సూచించారు.ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వినియోగం వంటి రహదారి నియమాలను కచ్చితంగా పాటించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, వాటి నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

## అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలి



ప్రజాస్ఫూర్తి , జన్నారం : అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని జన్నారం అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్ కోరారు. అగ్నిమాపక వారోత్సవాల భాగంగా రెండవ రోజైన బుధవారం రోజున జన్నారం పట్టణంలోని బస్టాండు కవ్వాల్ చౌరస్తా సినిమా హాల్ చౌరస్తా వద్ద ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ప్రజలకు, వ్యాపారస్తులకు అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు స్టిక్కర్లు, కరపత్రాలను, పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా వ్యాపారస్తులు దుకాణాలను మూసివేసిన సమయంలో కరెంటు మెయిన్ ను స్విచ్ ను ఆఫ్ చేయాలని అలాగే విద్యుత్ వైర్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు వోజ్జల వామన్,కార్యవర్గసభ్యుడు మాధంశెట్టి భూమేష్,అగ్నిమాపక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు మండల స్థాయిలో మండల సభలు ఘనంగా నిర్వహించాలి

* **జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 16వ తేదీన ఉదయం 9:30 గంటలకు మండల స్థాయిలో మండల సభలు ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక మండల సభ నిర్వహణ,ఏర్పాట్ల పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు అమలు, తీసుకోవాల్సిన చర్యలు, మండల, పట్టణ, వార్డు, గ్రామస్థాయిలో అభివృద్ధి పనుల పర్యవేక్షణ అవసరం ఉన్న పనుల గుర్తింపు తదితర అంశాలపై ప్రభుత్వం తెలిపిన విధంగా సభలు ఏర్పాటు చేయాలని, ఈ సభలకు ప్రజాప్రతినిధులను, మండల సమైక్య బృందాల సభ్యులను,యువతి, యువకులను ప్రజలందరినీ ఆహ్వానించాలని, వేదిక ప్రాంగణంలో త్రాగునీరు, స్నాక్స్, ఫ్యాన్లు, కూలర్లు తదితర సౌకర్యాలను సిద్ధం చేయాలన్నారు,ప్రభుత్వ పథకాల ప్రదర్శన నిమిత్తం ప్రత్యేక చర్యలు వీడియో, ఆడియో ఏర్పాట్లు చేయాలన్నారు,ప్రత్యేకించి రోడ్డు భద్రత అరైవ్ అలైవ్, రోడ్ సేఫ్టీ హెల్మెట్, సీట్ బెల్ట్, ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన చర్యలు, రోడ్ సేఫ్టీ గ్రామ, మండల, పట్టణ, వార్డు కమిటీల నియామకం చేసి ప్రజల్లో అవగాహన కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు, గత గ్రామసభలలో గుర్తించిన అభివృద్ధి సమస్యల పరిష్కారం ఎంతవరకు జరిగింది అనే అంశం, చర్చించాలన్నారు. ముందస్తు రానున్న రోజుల్లో అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన అంశాలపై తీర్మానాలు చేయడం, యాక్షన్ ప్లాన్ రెడీ చేసి పక్కా ప్రణాళికతో మండల సభలను నిర్వహించాలని ఆదేశించారు,రానున్న వేసవి నేపథ్యంలో హిట్ వే, త్రాగునీరు సరఫరా చేయుటకు తీసుకుంటున్న యాక్షన్ ప్లాన్ ను ప్రజలకు చదివి వినిపించాలని, వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఆరోగ్య సూచనలపై సంబంధిత సిబ్బంది కరపత్రాలు, నివేదికల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు,రైతు భరోసా, రైతు బీమా, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లబ్ధిదారులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకం, కామన్ డైట్ మెనూ, సన్న బియ్యం బోనస్, (10) థీమ్స్, 6 గ్యారంటీలు, నూతనంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, సంబంధిత అన్ని విభాగాల సమన్వయంతో మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సభను నిర్వహించాలని సూచించారు, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, జెడ్పి సీఈవో పురుషోత్తం, డిపిఓ హరిప్రసాద్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్, మిషన్ భగీరథ ఇంజనీర్, తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి పాఠశాలలో ఘనంగా ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లి లో ట్విన్నింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.పాఠశాలల్లో పిల్లల నమోదును పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం బ్రాహ్మణపల్లిలో వినూత్న రీతిలో నిర్వహించారు. బ్రాహ్మణపల్లికి సమీపంలో ఉన్న జిల్లెల్లగూడెం,కొమ్ముగూడెంలో ప్రాథమిక పాఠశాలలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులను, ఉపాధ్యాయులను బ్రాహ్మణపల్లి పాఠశాలకు ఆహ్వానించారు. వారికి ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లిలో ఉన్నటువంటి వసతులు గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం దగ్గరుండి వివరించారు. విద్యార్థులకు ఆటల పోటీలు, డాన్స్ కార్యక్రమాలు నిర్వహించి, వాటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు కూడా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ధారావత్ భద్రు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పాఠశాలల్లో ట్వీనింగ్ ఆఫ్ స్కూల్స్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. సమీపంలో ఉన్న ఒక పాఠశాల ఆతిథ్యం ఇవ్వగా మిగతా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులను అతిథులుగా ఆహ్వానిస్తారని వివరించారు. ఈ సందర్భంగా జిల్లెల్లగూడెం కొమ్ముగూడెం పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న విద్యార్థులు చక్కని గార్డెనింగ్, ఆట స్థలం, ల్యాబ్ తో పాటు డిజిటల్ క్లాస్ రూమ్ లాంటి అన్ని సౌకర్యాలు ఉన్న బ్రాహ్మణపల్లి పాఠశాలలో ఆరో తరగతిలో చేరాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లెల్ల గూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూడూరు నాగేశ్వరరావు, కొమ్ముగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోమ రవి, విలేఖరి ఆలకుంట్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్య ప్రకాష్,గొట్టిముక్కల పవన్ రాజ్, రాచకొండ ఉపేందర్, కుప్పం సూర్యతేజ, బానోత్ శంకర్ ,గిద్దె శృతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## చలి వేంద్రాన్ని ప్రారంభించిన ఎస్సై



ప్రజాస్ఫూర్తి, జన్నారం, దాహం తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని జన్నారం ఎస్సై ఉదయ్ కిరణ్ అన్నారు. జన్నారం పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జన్నారం మండల కేంద్రం లోని ధర్మారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన బుధవారం రోజున ప్రారంభించారు.ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ.. జన్నారం మండల కేంద్రానికి ప్రజలు వివిధ గ్రామాల నుండి వస్తుంటారని వేసవికాలం కావడంతో వారు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కు భూమేష్,పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు సిహెచ్ గంగయ్య, పొనకల్ పట్టణ అధ్యక్షుడు చెట్పల్లి కృష్ణ, ఉపాధ్యక్షుడు కందుల రమేష్, గౌరవ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంబారి అంజన్న,ప్రధాన కార్యదర్శి అయ్యోరు శ్రీనివాస్, కోశాధికారి రాజమౌళి, ప్రచార కార్యదర్శి దుస రాము, బాలిన రాము,నడిమెట్ల నరేందర్, పోతు వేణు,ఎం. శ్రీనివాస్,ఎన్.బుచ్చయ్య,గోనె సత్యం,రంజిత్,రమేష్,పీ.ల చ్చన్న,కే. బుచన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లల అభివృద్ధికి సరైన పోషకాహారం కీలకం

* **జిల్లా సంక్షేమ అధికారి కె.వి. కృష్ణవేణి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : చిన్నపిల్లల అభివృద్ధికి సరైన పోషకాహారం కీలకమని జిల్లా సంక్షేమ అధికారి కె.వి. కృష్ణవేణి తెలిపారు. '8వ పోషణ పక్వాడ' కార్యక్రమాన్ని చర్లపల్లి సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ఈ నెల 9 నుంచి 23 వరకు జరిగే ఈ కార్యక్రమంలో తల్లిశిశు పోషణ, ఆరోగ్య అవగాహనపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారూ.మాట, కదలికలు, స్పందన ప్రతి పిల్లలో వయస్సు ప్రకారం గమనిస్తూ వాటిని అభివృద్ధి చేయాలన్నారు. ఆరు నెలలలో చిన్నారులు చిరునవ్వు, తిరగడం, సంవత్సరంలోపు పిల్లలు నడవడానికి ప్రయత్నం చేయడం, రెండు సంవత్సరాలలో వాళ్ళు చిన్న చిన్న మాటలు మాట్లాడటం ఎప్పటికప్పుడు వెంటనే గుర్తించాలన్నారు. ఈ లక్షణాలు లేకపోతే వెంటనే తల్లిదండ్రులకు తెలియజేసి ఆ దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. తల్లిదండ్రులకు పిల్లలతో ఎక్కువగా మాట్లాడడం,ఆటలు ఆడించడాం, ప్రేమగా చూసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. టీవీ / మొబైల్ ఎక్కువగా చూపించకుండా ఆటలు వాడేలా అక్షరాలు గుర్తుపట్టేలా వారికి నేర్పించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ సిడిపిఓ తూముల నిర్మల సూపర్వైజర్ పార్వతి అంగన్వాడీ టీచర్లు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

## ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలి

**– అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం అత్యవసరమని అశ్వారావుపేట శాసన సభ్యులు జారె ఆదినారాయణ అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రాణాంతకమని హెచ్చరించారు. అశ్వారావుపేటలో రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "అరైవ్ -అలైవ్" కార్యక్రమాన్ని బుధవారం పట్టణంలోని శ్రీశ్రీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్య అతిథులుగా హాజరుకాగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపకూడదని స్పష్టం చేశారు. కారులో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ అరైవ్ -ఎలైవ్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం ప్రజల్లో రోడ్డు భద్రతపై చైతన్యం కల్పించడం అని తెలిపారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు పాఠశాల స్థాయిలో వక్తృత్వ పోటీలు నిర్వహించగా అందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎమ్మెల్యే, ఎస్పీ, మున్సిపల్ చైర్మన్ శశికళ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జూపల్లి శశికళ, వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు రెడ్డి, ఎస్సై యాయాతి రాజు, అదనపు ఎస్ఐ అఖిల, ఎంపీడీవో అప్పారావు, మున్సిపాలిటీ పాలకవర్గ సభ్యులు, సర్పంచులు, ఉప సర్పంచులు, అంగన్వాడి కార్యకర్తలు, వివోఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థుల రక్షణే లక్ష్యం రహదారిపై వైట్ లైన్ల ఏర్పాటు

* **ముస్తాబాద్‌లో అరైవ్ అలైవ్ కార్యక్రమం**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ పాఠశాల విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రహదారిపై వైట్ లైన్లను ఏర్పాటు చేసినట్లు ముస్తాబాద్ ఎస్.ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. బుధవారం అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసర ప్రాంతాల్లోని ప్రధాన రహదారిపై ఈ గుర్తులను అమర్చారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురికాకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వాహనదారులు పాఠశాలల వద్ద వేగాన్ని తగ్గించి, వైట్ లైన్లను గమనిస్తూ జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు ఈ లైన్లు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. నిరంతరం విద్యార్థుల భద్రతపై అవగాహన కల్పిస్తూ ఇటువంటి మరిన్ని కార్యక్రమాలు చేపడతామని వారు వివరించారు.

## చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ హెల్మెట్ పై అవగాహన బైక్ ర్యాలీ



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మార్వో ఆఫీస్, సర్కిల్ నుండి అండర్ బ్రిడ్జి, రైల్వే స్టేషన్ ,బస్టాండ్, నర్సంపేట రోడ్, మళ్లీ ఎమ్మార్వో ఆఫీస్ సర్కిల్ వరకు హెల్మెట్ల వాడకం చిన్నపిల్లల పాత్ర కచ్చితంగా హెల్మెట్లు ధరించి పిల్లలను బడికి పంపే క్రమంలో నియమాలు పాటించాలని, ప్రభుత్వ, ప్రైవేటు, విద్యా సంస్థలు, ఈరోజు జిల్లా విద్యాశాఖ, రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ సూచనలు, జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ స్నేహ శబరీష్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. స్వయాన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్, వారి పాప, డీఎస్పీలు, రవాణా శాఖ, విద్యాశాఖ, పోలీస్ సిబ్బంది వారు వారి పిల్లలు హెల్మెట్లు ధరించి బైక్ ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచారు.

# ఈనెల 16న ఢిల్లీలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలి..

* **జనగణనలో కుల గణన చేపట్టాలి.**
* **మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నియోజకవర్గం దక్షిణ భారత దేశానికి తీవ్రంగా నష్టం జరుగుతుందని మాజీ రాజ్యసభ సభ్యులు వి హనుమంతరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో డిసిసి అధ్యక్షులు పున్న కైలాష్ నేత అధ్యక్షతన స్థానిక యాదవ్ సంఘం భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం డిలిమిటేషన్లో కనీసం ప్రతిపక్షాల సంప్రదింపులు లేకుండానే తన ఇష్టానుసారంగా చేపడుతుందన్నారు. ప్రస్తుతం మోడీ ప్రభుత్వం చేపడుతున్న ఈ పంధా ద్వారా ఉత్తర భారత దేశంలో ఎక్కువ పార్లమెంటు సీట్లు పెరుగుతున్నాయని, దేశంలో తక్కువ సీట్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తర భారతదేశంలో పెరుగుతున్న సీట్ల వల్ల అధికారంలోకి రావడం సులభం అవుతుంది అనే ఉద్దేశంతో బిజెపి ప్రభుత్వంవ్యవహరిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జన గణనలో కులగన తప్పనిసరిగా ఉండాలని ఆయన డిమాండ్ చేశారు. కులగనన చేస్తేనే దేశంలో తమ జనాభా తెలుస్తుందని తద్వారా బడ్జెట్లో వాటా, రాజకీయ అధికారంలో తమ భాగస్వామ్యం పెరుగుతుందన్నారు ప్రభుత్వం తీసుకువచ్చిన మహిళా రిజర్వేషన్ బిల్లు బీసీలకు ప్రత్యేక కోట నిర్వహించాలని డిమాండ్ చేశారు. జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ కావాలని డిమాండ్ చేస్తున్న ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన మోడీ స్పందించకపోవడం ఆసియాస్పదమన్నారు. జనగణనతో పాటే కులగరణ చేపట్టాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 16న ఢిల్లీలో జరిగే ధర్నాకు పెద్ద ఎత్తున హాజరు కావాలని అనగారిన వర్గాల నాయకులకు కార్యకర్తలకు విహెచ్ పిలుపునిచ్చారు. డిసిసి అధ్యక్షులు పూన్న కైలాస నేత అధ్యక్షతన జరిగిన ఈ విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దుడుకు లక్ష్మీనారాయణ , ఎస్సీ సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు, మాజీ వైస్ ఎంపీపీ పరమేష్, గుర్రంపోడు కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, పోకల అశోక్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు వేముల గోపీనాథ్, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు కొంపెల్లి బిక్షపతి, గుడిపాటి లక్ష్మీనరసయ్య, ముంతాజ్ అలీ, అన్నెబోయిన సుధాకర్,, నోముల జనార్ధన్, రవీందర్ రెడ్డి, ధనుంజయ, సైదులు,, మేకల సాగర్ రెడ్డి, జిల్లా వెంకటేశం, జస్వంత్, చిలుకరాజు సతీష్, జేరిపోతుల రమేష్ గౌడ్ వెంకట నరసయ్య, కర్నాటి యాదగిరి, గాజుల శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు ఏర్పుల శ్రవణ్ కుమార్, గుండు వెంకటేశ్వర్లు, కట్టెల శివ, జనార్ధన్ గౌడ్, కార్తీక్ రెడ్డితదితరులు పాల్గొన్నారు

## 12 బెటాలియన్ ముందు చలివేంద్రం ప్రారంభం



నల్లగొండ,ప్రజాస్ఫూర్తి : జగిని టెక్స్ టైల్స్, జగిని దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో అన్నపర్తి 12 బెటాలియన్ ముందు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బెటాలియన్ కమాండెంట్ వీరయ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సందర్భంగా పాదాచారుల దప్పిక తీర్చటానికి జగిని టెక్స్ టైల్స్ జగిని దంత వైద్య శాల వారిచే చలివేంద్రం ఏర్పాటు చేడం అభినందనీయమన్నారు. టెక్స్టైల్స్ అధినేత జగిని వెంకన్న మాట్లాడుతూ గత పదకొండు సంవత్సరాలనుండి ఇక్కడ చలివేంద్రం పెట్టనైనది ప్రతీ ఒకరు వినియోగించుకోవాలని ప్రతి సంవత్సరము లాగే ఈ సమ్మర్ కూడా చలివేంద్రం లు ఏర్పాటు చేయటం మాకు చాలా సంతృప్తి, ఆనందదాయకం అని తెలిపారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ జగిని ఆదిత్య, జగిని వెంకన్న, కమండెంట్ వీరయ్య, అడిషనల్ నాగేశ్వరావు లు, డీఎస్పీలు సిఐలు ఎస్ఐలు లుపోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ లో స్టేట్ మూడవ ర్యాంక్ సాధించిన ప్యాట మాధుర్య కు అభినందనలు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : ఇంటర్మీడియట్ పరీక్షలో స్టేట్ 3 వ ర్యాంక్ సాధించిన ప్యాట మాధుర్యను కల్వకుంట్ల కవిత బుధవారం తన నివాసానికి పిలిపించుకుని అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో జాతీయ బిసి సేన తరపున రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్ యాదవ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సదర్ శ్రీను , ప్రధాన కార్యదర్శి జయ శ్రీకాంత్ ,పాలమూరు జిల్లా అధ్యక్షులు ప్రకాష్ , కోర్ కమిటీ మెంబర్ చిన్న బాలరాజు , భువనచంద్ర యాదవ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియా కాన్ఫరెన్స్ కాల్ ప్రారంభం



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ నందు సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహా రావు నేత ఆదేశాల మేరకు గురువారం మీడియా కాన్ఫరెన్స్ హాల్ ను ప్రారంభించారు. ఇంచార్జ్ మీడియా స్పోక్ పర్సన్ గ డాక్టర్ శ్రీకాంత్ వర్మ డిప్యూటీ సూపరింటెండెంట్ ని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసారు. ఈ సందర్భంగా సూపరిండెంట్ నరసింహారావు మాట్లాడుతూ ఆసుపత్రికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈ కాన్ఫరెన్స్ కాల్ ద్వారా అందిస్తామన్నారు ఈ కార్యక్రమం లొ మీడియా మిత్రులు మరియూ హాస్పిటల్ స్టాఫ్ పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ సభ్యులు గా గడ్డమీది బాలరాజు నియామకం



ప్రజాస్ఫూర్తి, మేడ్చల్ జిల్లా : మేడ్చల్ జిల్లా అక్రిడిటేషన్ సభ్యులు గా జిల్లా టియుడబ్ల్యూజె అధ్యక్షులు గడ్డమీది బాలరాజు నియమితులయ్యారు. జిల్లా కలెక్టర్ పంపిన ప్రతిపాదనల మేరకు సమాచార శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజాస్ఫూర్తి ఎడిటర్ గా పని చేస్తున్న ఆయన జిల్లాలో చిన్న పత్రికల ప్రతినిధిగా ఎన్నికయ్యారు. ఆయన తో పాటు యూనియన్ ప్రతినిధులు గా మోతె వెంకట్ రెడ్డి, రామారావు, బిగ్ పేపర్ ప్రతినిధి గా సునీల్, మీడియం పేపర్ ప్రతినిధిగా దిశ రవి, ఎలక్ట్రానిక్ మీడియా సభ్యులు గా ప్రసాద్, భూపాల్, ఫోటో జర్నలిస్ట్ గా రాకేశ్ రెడ్డి నియమితులైయ్యారు. త్వరలోనే సమావేశం నిర్వహించి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిషన్ లు అందేలా చూస్తామామని బాలరాజు తెలిపారు.

## ఇంటర్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి సన్మానం



ప్రజాస్ఫూర్తి, శ్రీరంగాపురం, వనపర్తి జిల్లా : మండల పరిధిలోని కంబలాపురం తాండ కు చెందిన బలరాం నాయక్ కూతురు వెన్నెల ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగం ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించింది. ఈ సందర్భంగా బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థిని వెన్నెల ఇంటికి వెళ్లి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌లో మరెన్నో అత్యుత్తమ ఫలితాలు సాధించి గ్రామానికి, మండలానికి మంచిపేరు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థిని ని సన్మానించిన వారిలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శటమోని రామచంద్రయ్య, కుమ్మరి గోవిందు, విష్ణు, బహుజన రమేష్, మల్లేష్, వెంకటయ్య, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో పక్షుల ప్రాణాలను కాపాడండి

* **పాఠశాల చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి పిలుపు**



ప్రజాస్ఫూర్తి, గాజులరామారం: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పక్షుల ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పాఠశాల చైర్మన్ సొంటిరెడ్డి పున్నారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అధికమవుతుండడంతో దాహంతో అలమటిస్తున్న పక్షులు నీరు అందక సొమ్మసిల్లి మరణించే పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమ బాల్కనీ, టెర్రస్ లేదా కిటికీ అంచుల వద్ద గిన్నెల్లో నీళ్లు ఉంచాలని సూచించారు. ఈ వినూత్న కార్యక్రమానికి ఎస్‌పీఆర్ గ్లోబల్ స్కూల్ వేదికగా నిలిచింది. పాఠశాల ఆవరణలో చిన్నారుల సమక్షంలో చైర్మన్ స్వయంగా పక్షులకు నీరు పెట్టి అవగాహన కల్పించారు. చిన్నారులు కూడా ఇలాంటి మంచి అలవాట్లు అలవర్చుకోవాలని హితబోధ చేశారు. మీరు ఉంచే ఒక గిన్నె నీళ్లు పక్షులకు ప్రాణదాయకమైన ఆశ్రయంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా నీడ ఉన్న ప్రదేశాల్లో ప్రతిరోజూ శుభ్రమైన, తాజా నీళ్లు ఉంచడం వల్ల పక్షులకు ఎంతో మేలు జరుగుతుందని విద్యార్థులకు వివరించారు.

## అడవుల్లో పండ్ల చెట్లు పెంచాలి

: **ప్రేమ్ దయాల్**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అడవుల్లో కాయలు, పండ్ల మొక్కలను విస్తృతంగా నాటించడం ద్వారా వన్యప్రాణులను సంరక్షించడంతో పాటు గిరిజన ఆదివాసి ప్రజలకు జీవనోపాధి కల్పించాలని ఆధార్ పార్టీ కొత్తగూడెం అసెంబ్లీ ఇంచార్జ్ బోడికల ప్రేమ్ దయాల్ కోరారు. ఈ మేరకు కేంద్ర అటవీ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖలకు లేఖ రాశారు. ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో అడవుల్లో ఆహారం లభించక వన్యప్రాణులు జనవాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా కోతుల బెడద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అధికమై ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, పలుచోట్ల ప్రాణనష్టం కూడా సంభవిస్తున్నదన్నారు. నివాసాలు, ఆసుపత్రులు, పబ్లిక్ ప్రదేశాల్లో కోతుల సంచారం పెరిగి ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. అలాగే పంట పొలాలపై కోతులు, ఇతర వన్యప్రాణుల దాడులతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఎంతో శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రతి ఏడాది వర్షాకాలంలో చేపట్టే మొక్కల నాటే కార్యక్రమాల్లో పండ్ల, కాయల మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దీంతో వన్యప్రాణులకు సహజంగా ఆహారం లభిస్తుందని, జనవాసాల్లోకి వచ్చే పరిస్థితులు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. అదే విధంగా గిరిజనులు అడవుల్లో లభించే పండ్లు, కాయలను సేకరించి విక్రయాల ద్వారా ఉపాధి పొందవచ్చని తెలిపారు. సహజసిద్ధమైన పండ్లు ప్రజలకు కూడా అందుబాటులోకి వస్తాయని చెప్పారు. వన్యప్రాణులు జనవాసాల్లోకి రాకుండా నివారించేందుకు, పర్యావరణ పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే ఏకైక రక్షణ కవచం హెల్మెట్

* **కూకట్పల్లి ఏడీసీపీ సుదర్శన్**




సైబరాబాద్ ప్రజాస్ఫూర్తి : ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలను కాపాడే ఏకైక రక్షణ కవచం హెల్మెట్ మాత్రమేనని కూకట్పల్లి ఏడీసీపీ సుదర్శన్ స్పష్టం చేశారు. పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'ఆరైవ్ ఆలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం కూకట్పల్లిలోని జెనెసిస్ స్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేటి కాలంలో మారుతున్న జీవన విధానం, సరైన నిద్ర లేకపోవడం మరియు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవాలనే తొందర వల్లే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మానవ ప్రాణం ఎంతో అమూల్యమైనదని, ప్రతి ఒక్కరూ తమపై ఆధారపడి ఉన్న కుటుంబ సభ్యుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. ప్రయాణాల్లో "స్టార్ట్ ఎర్లీ - గో స్లోలీ - రీచ్ సేఫ్లీ" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ముఖ్యంగా యువత మరియు విద్యార్థులు ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, అందుకే వారిలో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా హెల్మెట్ ధరించడంపై ఉన్న అపోహల గురించి స్పందిస్తూ, హెల్మెట్ పెట్టుకుంటే జుట్టు రాలిపోతుందనే అపోహతో ప్రాణాలను రిస్క్ లో పెట్టవద్దని అదనపు ఏడీసీపీ హితవు పలికారు. ఈ కార్యక్రమం లో కూకట్‌పల్లి లా అండ్ ఆర్డర్ ఎస్‌హెచ్ఓ కె.వి. సుబ్బారావు, ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ తిమ్మప్ప జెనెసిస్ స్కూల్ విద్యార్థులు, పోలీసులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఆరోగ్యం,విద్యుత్ రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత..!

* **తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**
* **డిప్యూటీ సీఎం భట్టితో కలిసి కల్లూరు మండలంలో పర్యటన**



ప్రజాస్ఫూర్తి/ఖమ్మం : కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే విద్యుత్, ఆరోగ్య రంగాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తెలంగాణ రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. బుధవారం కల్లూరు మండలంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి ఆయన పర్యటించారు. కల్లూరులో రూ.10.50 కోట్లతో నిర్మించిన 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించడంతో పాటు, నారాయణపురంలో రూ.2.75 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలకు సమీపంలోనే మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఈ ఆసుపత్రి కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాగే కొత్తగా నిర్మించనున్న విద్యుత్ ఉపకేంద్రం ద్వారా పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తోందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, ఎన్.పి.డి. సి.ఎల్ సీఎండి వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి,సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ హరి హర ఉత్తర అయ్యప్ప స్వామి దేవాలయంలో విష్ పూజ



భువనగిరి , ప్రజాస్ఫూర్తి : శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం శబరి నగర్ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు ఆలయ ప్రధానార్చకులు నరేంద్ర శర్మ జితేందర్ తివారి ఆధ్వర్యంలో బుధవారం విష్ పూజ అంగరంగ వైభవముగా నిర్వహించుకోవడం జరిగింది విష్ పూజ అంటే కేరళ మలయాళీ నూతన సంవత్సరం ప్రారంభం కేరళ సాంప్రదాయ ప్రకారం ఇక్కడ కూడా అదేవిధంగా ఉత్సవమూర్తి అయ్యప్ప స్వామి కి పండ్లు కూరగాయలు నవధాన్యాలు ఆకుకూరలు కిరాణా సరుకులు డ్రై ఫ్రూట్స్ తో స్వామివారి ముందు ఉంచి పూజలు చేసి ఆ పదార్థాలన్నీ కిచిడిగా చేసి వచ్చిన భక్తులందరికీ ప్రసాదముగా అందించడం జరిగింది అదేవిధంగా చిల్లర నాణాలు అయ్యప్పస్వామి వారి ముందు ఉంచి పూజ చేసి వచ్చిన భక్తులందరికీ పంచడం జరిగింది ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాస్ మంచుకొండ వినోద్ చామ రవీందర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చీకటిమల్ల రాములు సభ్యులు పోకల సోమన్న రావుల శ్రీధర్ ఉపేష్ చారి ఎకోజి పాలకుర్త వేణు మాధవ్ , మహిళా భక్తురాలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

## ప్రెస్ క్లబ్ నిర్మాణ నిర్వహణ కమిటీ ఎన్నిక



జీడిమెట్ల, ప్రజాస్ఫూర్తి : కుత్బుల్లాపూర్ ప్రెస్ క్లబ్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తామని ప్రెస్ క్లబ్ నిర్మాణ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం సూరారంలో గల ప్రెస్ క్లబ్లో జరిగిన సమావేశంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రెస్ క్లబ్ నిర్మాణ నిర్వహణ కమిటీని యూనియన్లకు అతీతంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారులుగా అస్కాని మారుతి సాగర్, గడ్డమీది బాలరాజు, తన్నీరు శ్రీనివాస్, సభ్యులుగా గుంటూరు శేఖర్, రంగు వెంకటేష్ గౌడ్, జగదీష్ గుప్త, కసుకుర్తి వెంకట్, కొలిపాక వెంకట్, జి.అశోక్, గోలిపల్లి దయాకర్ రెడ్డి, సుగ్రీవుడు, రెడ్డె బొయిన మల్లేష్, మాధవ రెడ్డి, శివలు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ప్రెస్ క్లబ్ నిర్మాణ విషయంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అన్ని యూనియన్లకు సంబంధించిన 150 మందికి పైగా పాత్రికేయులు పాల్గొన్నారు.

## ఐఐటీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గాయత్రి పాఠశాల విద్యార్థులు

* **అభినందించిన ఎంపీడీవో జలంధర్ రెడ్డి**




వలిగొండ , ప్రజాస్ఫూర్తి : మండల కేంద్రంలోని గాయత్రి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు ఐఐటి దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల ప్రజా పరిషత్ అధికారి జలంధర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఒకప్పుడు ఐఐటి అనేది పట్టణాలకు టౌన్ లకు మాత్రమే పరిమితమై చాలా వ్యయంతో కూడుకున్న చదువు గా ఉండేది ఇప్పుడు దానిని మండల స్థాయికి తీసుకొచ్చిన ఘనత గాయత్రి పాఠశాలకు దక్కింది అని కొనియాడారు రానున్న రోజుల్లో పోటీ ప్రపంచానికి తట్టుకొని నిలబడేటట్లు విద్యార్థులకు ఐఐటి ఎంతో సహాయ పడుతుందని అన్నారు అదేవిధంగా విద్యార్థులు ప్రతి సంవత్సరం ఐఐటి విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు ఐఐటిని తీసుకువచ్చిన గాయత్రి పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో గాయత్రి హై స్కూల్ చైర్మన్ తవటం నరహరి వైస్ చైర్మన్ పనుమటి మురళీధర్ రెడ్డి కరస్పాండెంట్ భీమిడి యాదిరెడ్డి వైస్ ప్రిన్సిపల్ కొంతం బిక్షపతి ఆర్గనైజింగ్ సెక్రటరీ పాలకుర్ల వెంకటేశం ప్రిన్సిపల్ అనురాధ భీమిడి కవిత రమాదేవి ఐఐటి ఉపాధ్యాయులు ముత్యాలు స్వామి సాయి తేజ ఉపాధ్యాయిని ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

# ఎనిమిదవ రోజు కు చెరిన విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మె

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : విద్యుత్ ఉద్యోగుల నిరవధిక సమ్మెలో భాగంగా బుధవారం ఎనిమిదవ రోజు సమ్మెలో భాగంగా ముఖానికి నల్ల మాస్క్ ధరించి మౌన దీక్ష చేశారు. ఈ యొక్క సమ్మెకు పాల్గొన్న కార్మిక నాయకులు , జేఏసీ నాయకులు ఆర్టిజన్ మిత్రులు ప్రతి ఒక్క కార్మికులుకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను మా యొక్క డిమాండ్లు నెరవేరేవరకు సమ్మె కొనసాగుతుంది సమ్మెలో పాల్గొన్న నాయకులు అలీ హరి శర్మ శేఖర్ మధు రాంబాబు పద్మారావు రాఘవరెడ్డి రవి బాలరాజు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సేకరణపై నిరసన.. వికారాబాద్‌లో కవిత అరెస్టు

వికారాబాద్: వికారాబాద్‌లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను పోలీసులు అరెస్టు చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం రైతుల భూములను బలవంతంగా సేకరిస్తున్నారని ఆరోపిస్తూ ఉదయం నుంచి కవిత ఆందోళన చేశారు. ఈ క్రమంలోనే రైతులతో కలిసి వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

# చేనేత కార్మికులు ఈ వైద్య శిబిరాలు ను సద్వినియోగం చేసుకోవాలి

*** జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**




*భువనగిరి , ప్రజాస్ఫూర్తి : జిల్లా వ్యాప్తంగా సుమారు 10,323 మంది చేనేత కార్మికులు నివసిస్తున్నారని ఆయా మండలాలు, గ్రామాలలో ఏప్రిల్ 16వ తేదీ నుండి ఆరోగ్య శిబిరాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆరోగ్య శిబిరాలలో ప్రభుత్వ వైద్యులు అయిన జనరల్ ఫిజీషియన్, ఆప్తమాలజిస్ట్ (కంటి వైద్యుడు), ఆర్థోపెడిషియన్ (ఎముకల వైద్యుడు) పాల్గొని చేనేత కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు జరుగుతుందిఈ శిబిరాలలో చేనేత కార్మికులకు రక్తపోటు బీపి పరీక్షలు, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలు, ఎముకల సమస్యల నిర్ధారణతో పాటు వివిధ దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలకు సంబంధించిన పరీక్షలు నిర్వహించబడును. వ్యాధుల తీవ్రతను బట్టి రిఫరల్ హాస్పటల్ తీసుకొని వెళ్లడం జరుగుతుందని తెలిపారు .శిబిరాల సమయం & ప్రతి రోజు ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఉంటుందని తెలిపారు. ఆరోగ్య శిబిరాల తేదీలు మరియు ప్రదేశాలు అందుబాటులో ఉంటాయని ఆ వివరాలు 16 న ఆలేరు మండలం, గౌడ సంఘం మందిరం 17 న ఆత్మకూరు మండలం, ప్రభుత్వ ప్రాథమిక హాస్పిటల్లో ఆత్మకూరు 18 న ప్రభుత్వ హాస్పిటల్లో భువనగిరి 20 నుండి 23 వరకు చౌటుప్పల్, కొయ్యలగూడెం, కుంట్లగూడెం ప్రాంతాలు 2 4 నా మోటకొండూరు ప్రాథమిక హాస్పిటల్ లో 25 మోత్కూర్ ప్రభుత్వ హాస్పిటల్ లో 27 నుండి 02 వరకు - పోచంపల్లి సొసైటీ డైయింగ్ హౌస్ లో 04 నా రాజాపేట ప్రభుత్వ ప్రాథమిక హాస్పిటల్ లో 05 నుండి 06వరకు, రామన్నపేట లో 07 న వలిగొండ ప్రభుత్వ ప్రాథమిక హాస్పిటల్లో 08 న యాదగిరిగుట్ట ప్రాథమిక కేంద్రంలో 11 న గుండాల ప్రభుత్వ ఆసుపత్రిలో 12 న సంస్థ నారాయణపూర్ ప్రభుత్వం ఆస్పత్రిలో 13 న పుట్టపాక క్లస్టర్ బిల్డింగ్ నిర్వహించబడును అని తెలిపారు. జిల్లాలోని చేనేత కార్మికులు వారి కుటుంబ సభ్యులు ఈ ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవలసిందిగా కలెక్టర్ కోరారు

# ధైర్యముంటే నా కారు రోజూ చెక్ చేయండి: మమతా బెనర్జీ



అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ పశ్చిమ బెంగాల్‌లో తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో తాను ప్రయాణిస్తున్న వాహనాన్ని చెక్ చేసేందుకు కేంద్ర బలగాలు యత్నించాయని దీదీ ఆరోపించారు. కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే తనిఖీ చేయాలంటూ ఆదేశాలు అందాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ దినాజ్‌పుర్ జిల్లాలో ఎన్నికల ర్యాలీలో పాల్గొన్న మమత మాట్లాడుతూ "ఈరోజు ఉదయం కోల్‌కతా ఎయిర్‌పోర్టుకు వెళ్తుండగా కేంద్ర బలగాలు నా కారును చెక్ చేయడానికి ప్రయత్నించాయి. ఒకవేళ మీకు ధైర్యం ఉంటే నా కారును రోజూ తనిఖీ చేయండి. కేవలం టీఎంసీ నాయకుల వాహనాల్లోనే ఈ చెకింగ్‌లు జరుగుతున్నాయి" అని ఆరోపించారు. దీదీ మేనల్లుడు, తృణమూల్ నాయకుడు అభిషేక్ బెనర్జీ వాహనాన్ని కూడా తనిఖీ చేసినట్టు సమాచారం. "కేవలం టీఎంసీ నాయకుల వాహనాలనే లక్ష్యంగా చేసుకొంటున్నారు. ఇది కుట్రపూరిత చర్యే" అని టీఎంసీ నేత కునాల్ ఘోష్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, బెంగాల్‌లో 294 అసెంబ్లీ స్థానాలకు ఏప్రిల్ 23, 29న రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు మే 4న విడుదల కానున్నాయి.

## ఆయా రాష్ట్రాల్లో
# జనగణన తొలి దశ.. ఏప్రిల్ 16 నుంచి గృహ గణన



దిల్లీ: జనగణనలో భాగంగా దిల్లీ, గోవా, కర్ణాటక, మిజోరాం, ఒడిశా, సిక్కిం, అండమాన్ నికోబార్, లక్షద్వీప్‌లలో ఏప్రిల్ 16 నుంచి క్షేత్రస్థాయిలో గృహ గణనను ప్రారంభించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఇప్పటికే సెల్ఫ్ ఎన్యూమరేషన్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎన్యూమరేటర్లు మే 15 వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. ప్రతి ఇంటికి వెళ్లి డేటా సేకరించనున్నారు. స్వయంగా నమోదు చేసుకున్న వారి వివరాలను నిర్ధరించనున్నారు. తొలిసారి తీసుకొచ్చిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ విధానంలో.. సుమారు 12 లక్షల గృహాలు అధికారిక పోర్టల్ ద్వారా నమోదైనట్లు కేంద్రం తెలిపింది. ఈ నెల 16 నుంచి ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హరియాణా, చండీగఢ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలో సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈనెల 30 వరకు ఈ ఆరు రాష్ట్రాల్లో పోర్టల్ అందుబాటులో ఉండనుంది. మే 1 నుంచి మే 30 వరకు హౌస్ లిస్టింగ్ నిర్వహించనున్నారు. బిహార్‌లో ఈ ప్రక్రియ ఏప్రిల్ 17 నుంచి ప్రారంభమై మే 1 వరకు కొనసాగుతుంది.



## రూ.50లక్షల లాటరీ..
# లేడీ టైలర్‌ను వరించిన అదృష్టం

లుధియానా: పంజాబ్‌లోని లుధియానాకు చెందిన ఓ మహిళను అదృష్టం వరించింది. ఇటీవల నిర్వహించిన లాటరీలో ఆమె రూ.50లక్షలు గెలుచుకుంది. రూ.వెయ్యితో లాటరీ టికెట్ కొనుగోలు చేయగా.. తొలి ప్రయత్నంలోనే భారీ మొత్తాన్ని కైవసం చేసుకోవడం గమనార్హం. నగరంలోని చందర్ నగర్‌కు చెందిన కుసుమ్ రాణి (50).. టైలర్‌గా జీవనోపాధి పొందుతున్నారు. వచ్చిన ఆదాయంతో కుటుంబానికి ఆమె అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో లాటరీ రూపంలో భారీ మొత్తాన్ని గెలుచుకున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్నట్లు కుటుంబ సభ్యులు.. తమ నంబర్లను నిర్ధరించుకున్న తర్వాత ఆనందంలో మునిగిపోయారు. పిల్లల భవిష్యత్తు కోసం ఈ డబ్బును ఉపయోగిస్తానని కుసుమ్ పేర్కొన్నారు.

# డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా ఓటేస్తాం: ఖర్గే



దిల్లీ: మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి అనుకూలంగానే ఉందని.. కానీ దానిని తీసుకువచ్చే విధానంపైనే అభ్యంతరాలు ఉన్నాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టి కేంద్రం రాజకీయ కుతంత్రాలు చేస్తోందని ఆరోపించారు. రాజ్యాంగంలోని అధికారాలన్నింటినీ కార్యనిర్వాహక వర్గం తీసుకుంటోందన్నారు. కేవలం ప్రతిపక్ష పార్టీలను అణచివేయడానికే కేంద్ర ప్రభుత్వం ఇలా చేస్తోందన్నారు. ఖర్గే నివాసంలో నిర్వహించిన ఇండియా కూటమి నేతల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు వ్యతిరేకంగా తామంతా పార్లమెంట్‌లో ఐక్యంగా పోరాడుతామని ఖర్గే పేర్కొన్నారు. కనీసం జనగణన కూడా పూర్తి చేయకుండా కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని విమర్శించారు. కొత్త జనాభా లెక్కల తర్వాతే డీలిమిటేషన్ చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్నారు. ఇందులో భాగంగా మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య (550)ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందులో రాష్ట్రాల నుంచి ఎన్నికయ్యే వారి సంఖ్యను 815గా, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 35గా పేర్కొంది. ఈ క్రమంలోనే మహిళా రిజర్వేషన్ బిల్లుకు డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్ని ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్నాయి.

# ఏఐ దుర్వినియోగంపై.. మెటా, ఎక్స్, గూగుల్‌కు నోటీసులు



అహ్మదాబాద్: ఏప్రిల్ 15 : ప్రముఖ టెక్ కంపెనీలైన మెటా ఇండియా, గూగుల్, ఎక్స్, రెడిట్‌లకు గుజరాత్ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఏఐని దుర్వినియోగం చేసి సృష్టిస్తున్న డీప్‌ఫేక్ వీడియోలు , ఫొటోలను ఈ ప్లాట్‌ఫామ్‌ల్లో పలువురు వ్యాప్తి చేస్తున్నారని.. వీటిని అడ్డుకోవాలని పిల్ దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. మే 8వ తేదీలోగా నోటీసులకు సమాధానమివ్వాలని ఆదేశించింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను తొలగించే విషయంలో మెరుగైన సమన్వయం కోసం సహ్యోగ్ పోర్టల్‌తో కలిసి పని చేయాలని ఆయా కంపెనీలకు సూచించింది. ఇప్పటికే ఈ కేసులో నోటీసులు అందుకున్న కేంద్ర, గుజరాత్ ప్రభుత్వాలు కోర్టులో అఫిడవిట్లు సమర్పించాయి. వాటిలో కృత్రిమ మేధ దుర్వినియోగంపై తాము జారీ చేసిన చట్టబద్ధమైన సూచనలు, నోటీసులపై టెక్ కంపెనీలు ఎటువంటి సమాధానం ఇవ్వట్లేదని పేర్కొన్నాయి. చట్టవిరుద్ధమైన కంటెంట్‌పై తక్షణ చర్యలు తీసుకోవడానికి అక్టోబర్ 2024లో సహ్యోగ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు కేంద్రం వెల్లడించింది. మెటా, గూగుల్ వంటి కొన్ని సంస్థలు ఈ నిబంధనలను పాటిస్తున్నప్పటికీ.. 'ఎక్స్' వంటి ఇతర సంస్థలు ఇందులో చేరలేదని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కోర్టుకు తెలియజేసింది. చట్టవిరుద్ధమైన కంటెంట్‌కు సంబంధించి 'ఎక్స్'కు 94 సూచనలు ఇవ్వగా వాటిపై ఇప్పటి వరకు ఎటువంటి స్పందన లేదని తెలిపింది.



## పర్యాటక ప్రదేశాలకు
# తెలంగాణ నిలయం: మంత్రి జూపల్లి

షేక్‌పేట: దేశంలోనే అత్యద్భుత వారసత్వ కట్టడాలు, పర్యాటక ప్రదేశాలకు తెలంగాణ నిలయమని.. దేశ, విదేశీ పర్యాటకులను మరింత ఆకర్షించేలా పర్యాటక రంగ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్‌తో కలిసి షేక్‌పేట కుతుబ్‌షాహీ టూంబ్స్, గోల్కొండ కటోరా హౌస్, ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యాటక ప్రదేశాల్లో సందర్శకుల కోసం మౌలిక వసతులను కల్పిస్తున్నామని అన్నారు. ఇందుకు అనుగుణంగా బడ్జెట్‌ను కేటాయిస్తున్నామని తెలిపారు.

**పర్యటన సాగిందిలా..**

టూంబ్స్‌లో జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడి ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్‌నూ సందర్శించారు. వక్ఫ్‌బోర్డు ట్రైబ్యునల్‌లో కేసులు ఉన్న ప్రాంతాలను మినహాయించి మిగతా ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కి.మీ. రోప్ వే ప్రాజెక్టుపై అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు అనుమతుల దశలో ఉందని అధికారులు వివరించారు. అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కటోరా హౌస్ మురికి కూపంగా మారిందని, పూడికలు తొలగించి పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలన్నారు. గోల్కొండ కోటకు వచ్చే పర్యాటకుల కోసం చార్మినార్ లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని మంత్రి ప్రతిపాదించారు. తద్వారా చేనేత, హస్త కళాకారులకు ఆదాయం కల్పించవచ్చన్నారు. అనంతరం ఖజానా బిల్డింగ్ ఆర్కియాలజికల్ మ్యూజియంను సందర్శించారు. మ్యూజియాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అక్కడ చేనేత, హస్త కళలను ప్రోత్సహించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. మ్యూజియం వెనుక ఉన్న ఆక్రమణలతోపాటు కటోరా హౌస్ వద్ద ఉన్న కబ్జాలను పోలీసుల సహాయంతో వారం రోజుల్లో తొలగించాలని ఆదేశించారు. పర్యటనలో రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, పలు విభాగాల అధికారులు ఉన్నారు.

## రాఘవ్ చడ్డా సెక్యూరిటీని తొలగించిన పంజాబ్..
# రక్షణ కల్పించేందుకు ముందుకు వచ్చిన కేంద్రం



రాజ్యసభ ఎంపీ రాఘవ్ చడ్డాకి(Raghav Chadha) జెడ్ ప్లస్ సెక్యూరిటీని పంజాబ్ ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయితే కేంద్రం ఆయనకు జెడ్ ప్లస్ కేటగిరీలో భద్రత కల్పించనున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో పంజాబ్‌కు సంబంధించిన కీలక సమస్యలను లేవనెత్తడంలో విఫలమయ్యారని సొంత పార్టీ ఆప్(AAP) నుంచే రాఘవ్ చడ్డా విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అయితే కేంద్రం భద్రత కల్పించనున్నట్లు ఇంకా ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా, రాజ్యసభలో ఆప్ ఉపనేత హోదా నుంచి రాఘవ్ చడ్డాను ఆ పార్టీ తొలగించడం మాటల యుద్ధానికి దారితీసిన సంగతి తెలిసిందే. తన గళాన్ని అణచివేయగలరేమో గానీ.. తనను ఓడించలేరంటూ చడ్డా వ్యాఖ్యానించారు. దీనిపై ఆప్ స్పందించింది. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో గళమెత్తడానికి ఆయన భయపడుతున్నారని పేర్కొంది. చడ్డా స్థానంలో అశోక్ మిత్తల్‌ను రాజ్యసభలో ఆప్ ఉపనేతగా నియమించిన విషయం తెలిసిందే.

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

* నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
* పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
* అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
* 'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
* జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
* రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
* ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
* నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
* ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.




# సీఎం రేవంత్‌తో మీనాక్షి నటరాజన్ భేటీ

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డితో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిణామాలపై ఈ భేటీలో చర్చిస్తున్నారు. నామినేటెడ్ పదవుల భర్తీ, పదవీకాలం ముగిసిన కార్పొరేషన్ ఛైర్మన్ల రెన్యూవల్‌పై చర్చించారు. సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీ మార్పు, జగిత్యాల నియోజకవర్గంలో పరిణామాలపై కూడా ఈ భేటీలో చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రులపై, ప్రభుత్వంపై విపక్షాలు చేస్తున్న విమర్శలు, ఆరోపణలపై ఈ భేటీలో చర్చించారు. సీఎం నివాసంలో ఈ భేటీ కొనసాగుతోంది.

# బయటి దొరికే ఫుడ్ ఇప్పుడు ఇంట్లోనే...

వానాకాలంలో చిరుతిళ్లు తినడం బాగా ఎంజాయ్ చేస్తారు. అయితే, అలాగని బయటి ఫుడ్ తింటే ఆరోగ్యం పాడవుతుంది ఎలాగా? అని ఆలోచిస్తుంటారు. అయితే, బయట దొరికే ఫుడ్‌ని ఇలా ఇంట్లోనే ఈజీగా చేసుకోండి.



## ఎగ్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – రెండు కప్పులు
- కోడిగుడ్లు (ఉడికిన) – నాలుగు
- ఉప్పు, నీళ్లు, నూనె – సరిపడా
- వెన్న – మూడు టీస్పూన్లు
- పచ్చిమిర్చి – మూడు
- ఉల్లిగడ్డలు, టొమాటోలు – రెండేసి చొప్పున
- కారం – ఒక టీస్పూన్
- పసుపు – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- గరం మసాలా – ఒక టీస్పూన్
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, ఉప్పు, వెన్న వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. దాన్ని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టాలి. తర్వాత ఒక గిన్నెలో పెట్టి మూతపెట్టి పక్కనపెట్టాలి. ఒక పాన్‌లో నూనె వేడి చేసి, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, టొమాటో తరుగు, ఉప్పు వేసి వేగించాలి. అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా వేసి కలపాలి. ఆ తర్వాత గిన్నెలో పెట్టిన పిండిని తీసి, ఉండలు చేయాలి. వాటిని చపాతీలా వత్తి, నూనె రాసి నాలుగు వైపులా మడతపెట్టి మరోసారి వత్తాలి. ఇలా మూడు లేదా నాలుగు సార్లు చేశాక, నాలుగు భాగాలుగా కట్ చేయాలి. ఒక్కోదాంట్లో రెడీ చేసిన స్టఫింగ్ దాంతోపాటు సగానికి కోసిన కోడిగుడ్డు పెట్టి మూసేయాలి. ఇడ్లీ ప్లేట్‌కి నూనె రాసి, వాటిని అందులో పెట్టాలి. మరో పాన్ లో చిన్న గిన్నె బోర్లించి, దానిపై ఇడ్లీ ప్లేట్ పెట్టి మూతపెట్టాలి. కాసేపటి తర్వాత మూత తీసి, వాటిని రెండోవైపు తిప్పి పెట్టాలి. మళ్లీ మూతపెట్టి ఉడికించాలి





## మసాలా కార్న్ టోస్ట్ కావాల్సినవి

- నూనె – రెండు టేబుల్ స్పూన్లు
- వెల్లుల్లి తరుగు – ఒక టేబుల్ స్పూన్
- ఉల్లిగడ్డ తరుగు – ఒక కప్పు
- జీలకర్ర పొడి – అర టీస్పూన్
- పచ్చిమిర్చి – ఒకటి
- కారం – ఒక టీస్పూన్
- గరం మసాలా – పావు టీస్పూన్
- ఫ్రెష్ క్రీమ్ – అర కప్పు
- చీజ్ – అర కప్పు
- కొత్తిమీర – కొంచెం
- వెన్న – ఒక టీస్పూన్
- బ్రెడ్ ముక్కలు – ఆరు

**తయారీ :** పాన్‌లో నూనె వేడి చేసి, వెల్లుల్లి, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి తరుగు, మొక్కజొన్న గింజలు ఒకదాని తర్వాత ఒకటి వేసి వేగించాలి. అందులో కారం, జీలకర్ర పొడి, గరం మసాలా, ఫ్రెష్ క్రీమ్, చీజ్ కూడా ఒక్కోటిగా వేస్తూ కలపాలి. ఆ తర్వాత పాన్‌లో వెన్న వేడి చేసి బ్రెడ్ ముక్కని అందులో పెట్టాలి. దానిపై కార్న్ మిశ్రమం పెట్టి, చీజ్ చల్లి మూతపెట్టి కాసేపు ఉడికించాలి. తర్వాత బ్రెడ్ ముక్కల్ని కట్ చేసి, కొత్తిమీర తరుగు చల్లాలి.





## ఆలూ మటర్ పఫ్ కావాల్సినవి

- గోధుమ పిండి – ఒక కప్పు
- నూనె, ఉప్పు, నీళ్లు – సరిపడా
- వాము – అర టీస్పూన్
- జీలకర్ర – అర టీస్పూన్
- పసుపు – అర టీస్పూన్
- గరం మసాలా – అర టీస్పూన్
- మొలకెత్తిన పచ్చి బటానీ – ఒక కప్పు
- పచ్చిమిర్చి – మూడు
- ఆలుగడ్డ, ఉల్లిగడ్డ – ఒక్కోటి
- అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీస్పూన్
- ధనియాల పొడి – ఒక టీస్పూన్
- నిమ్మరసం – ఒక టీస్పూన్
- కార్న్‌ఫ్లోర్ – నాలుగు టేబుల్ స్పూన్లు

**తయారీ :** ఒక గిన్నెలో గోధుమ పిండి, వాము, నూనె, ఉప్పు వేసి నీళ్లు పోసి కలిపి ముద్ద చేయాలి. మూతపెట్టి పది నిమిషాలు పక్కన పెట్టాలి. మిక్సీజార్‌లో మొలకెత్తిన పచ్చి బటానీ, పచ్చిమిర్చి, ఆలుగడ్డ తరుగు, ఉప్పు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి కచ్చాపచ్చాగా గ్రైండ్ చేయాలి. పాన్‌లో నూనె వేడి చేసి, జీలకర్ర, ఉల్లిగడ్డ తరుగు వేసి వేగించాలి. ఆ తర్వాత అందులో ఆలూ బటానీ మిశ్రమం కూడా వేసి కలపాలి. అందులో నీళ్లు పోసి మూత పెట్టి ఉడికించాలి. ఆపై పసుపు, గరం మసాలా, ధనియాల పొడి, నిమ్మరసం, కొత్తిమీర వేసి కలపాలి. ఒక గిన్నెలో కార్న్‌ఫ్లోర్, నూనె వేసి పేస్ట్‌లా కలపాలి. రెడీ చేసిన పిండి ముద్దను ఉండలు చేసి, చపాతీల్లా వత్తాలి. ఒక్కో చపాతీకి ఆ పేస్ట్ పూసి, పిండి చల్లాలి. అలా నాలుగైదు చపాతీలను ఒకదానిపై ఒకటి పేర్చాలి. తర్వాత వాటన్నింటిని రోల్‌లా చుట్టి, రింగులుగా కట్ చేయాలి. వాటిని మరోసారి చపాతీల్లా వత్తి, నాలుగు ముక్కలుగా కట్ చేసి, ఒక్కోదాంట్లో ఆలూ బటానీ స్టఫ్ పెట్టి, మూసేయాలి. అలా చేసిన వాటిని వేడి నూనెలో వేగిస్తే ఆలూ మటర్ పఫ్ రెడీ.






# కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే...

కోపంలో ఫ్రస్టేషన్, బాధ, అలగడం, దిగులు వంటివి కూడా ఉంటాయి. కోపం ఎక్స్‌ప్రెస్ చేసే విధానాన్ని బట్టి రిజల్ట్ వస్తుంది. అప్పుడప్పుడు చిరాకు, కోపం, విసుగు వంటివి రావడం సహజమే. మరి దీన్నుంచి బయటపడేదెలా?

- కోపం వస్తే.... మొదట చేయాల్సిన పని డీప్ బ్రీత్ తీసుకోవడం. కోపం తగ్గేవరకూ నిదానంగా శ్వాస తీసుకుంటూ... వదులుతూ ఉండాలి. తర్వాత మనలో మనం పాజిటివ్‌గా మాట్లాడుకోవాలి.
- కోపం ఎప్పుడు వచ్చినా దాన్ని ఎక్స్‌ప్రెస్ చేయకపోవడమే మంచిది. ఒకవేళ కోప్పడాల్సి వస్తే దాన్ని ఎక్స్‌ప్రెస్ చేసే విధానంలో జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఒక్కోసారి చిన్న చిన్నవాటికే ఎక్కువ కోపం చూపిస్తే అవి రిలేషన్‌షిప్ మీద ఎఫెక్ట్ చూపిస్తాయి.
- మీకు సపోర్ట్ చేసే వాళ్లకి మీ ఫీలింగ్స్ గురించి చెప్పండి. కాసేపు వాళ్లతో డిస్కస్ చేయండి. ప్రాబ్లమ్ ఏదైనా కోప్పడకుండా దాన్ని ఎలా సాల్వ్ చేయగలమో అని ఆలోచించాలి.
- ప్రాబ్లమ్ చిన్నదైతే ఎక్కువ రియాక్ట్ అవ్వకుండా ఉండేందుకు ప్రయత్నించాలి.
- నలుగురిలో ఉన్నప్పుడు వీలైనంత వరకూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండాలి.
- కోపాన్ని కంట్రోల్ చేసుకోవాలంటే ముందు ఎదుటి వాళ్లు చెప్పేది వినాలి. ఎందుకంటే వినడం కూడా ఒక కళే, ముందు అది నేర్చుకోవాలి. కమ్యూనికేషన్ పెంచుకోవాలి.

ఇద్దరు మాట్లాడుకుంటుంటే ఒకరి మీద ఒకరికి నమ్మకం ఉండడం చాలా ఇంపార్టెంట్.

- అసౌకర్యంగా అనిపించే చోటు నుంచి దూరంగా వెళ్లాలి. కాసేపు హాయిగా నేచర్‌ను చూస్తూ వాకింగ్ చేయాలి.
- మీకు నచ్చిన పుస్తకాలు లేదా మోటివేట్ చేసే పుస్తకాలను చదువుకోవాలి. ఈ ప్రాబ్లమ్ మరీ ఎక్కువ ఉంటే ప్రొఫెషనల్ థెరపిస్ట్‌ను కలవడం మంచిది. ఆల్కహాల్ లేదా డ్రగ్స్ వంటి అలవాట్లు ఏవైనా ఉంటే కచ్చితంగా వాటిని మానుకోవాలి.
- కోపం వల్ల రిలేషన్‌షిప్స్ దెబ్బతింటాయి. దానివల్ల హెల్త్ ప్రాబ్లమ్స్ కూడా వస్తాయి. కోపం ఎక్కువ రోజులుంటే బీపీ పెరుగుతుంది. హార్ట్ ప్రాబ్లమ్స్, తలనొప్పి, స్కిన్ డిజార్డర్స్, అరుగుదల సమస్యలు వంటివి వస్తాయి. అంతేకాకుండా ఆల్కహాల్ తాగడం, క్రైమ్ చేయడం, ఇతరులను అవమానించడం వంటివి జరుగుతాయి.

## పచ్చిమిర్చిని ఇలా కూడా వాడొచ్చు!



- పచ్చిమిర్చి కట్ చేసిన తర్వాత కొందరికి చేతులు మండుతాయి. అలాంటప్పుడు చేతులకు పంచదార రుద్దుకుంటే మంచి ఉపశమనం లభిస్తుంది.
- మాంసాన్నివేయించేటప్పుడు అది బంగారు గోధుమ రంగులో మంచి లుక్ రావాలంటే మాంసంపై మిరపకాయ ముక్కలను చల్లితే చాలు.
- పచ్చిమిరపకాయల్ని కాసింత పసుపుతో చేర్చి సీసాలో నిలువ చేస్తే ఎరుపు రంగుకు మారకుండా ఉంటాయి.
- పచ్చిమిర్చి ఎక్కువ రోజులు ఫ్రెష్ ఉండాలంటే మొదట శుభ్రంగా కడిగి, ఆరబెట్టాలి. మిర్చి తొడిమలు తీసి, గాలి చొరబడని డబ్బా అడుగున టిష్యూ పేపర్ వేసి మిర్చిని దానిపై పెట్టాలి. వాటిపైన టిష్యూ పేపర్ వేసి మూత పెట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. పదిహేను రోజులకొకసారి టిష్యూ పేపర్ మార్చితే రెండు నెలల పాటు పచ్చిమిర్చి

# భారీ లాభాల్లో స్టాక్ మార్కెట్లు

**సెన్సెక్స్ 1,264 పాయింట్లు లాభం..**

**10 లక్షల కోట్లు పెరిగిన సంపద**

**అంతర్జాతీయ పరిణామాలతో మార్కెట్లలో జోష్**

**1,264 పాయింట్ల లాభంతో 78,111 వద్ద ముగిసిన సెన్సెక్స్**

**388 పాయింట్లు పెరిగి 24,231 వద్ద స్థిరపడిన నిఫ్టీ**

**మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ కనిపించిన కొనుగోళ్ల ఉత్సాహం**

**బలపడిన రూపాయి, తగ్గుముఖం పట్టిన ముడిచమురు ధరలు**



**ముంబై:** అంతర్జాతీయంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీ లాభాలను నమోదు చేశాయి. ఇరాన్‌తో వివాదం ముగింపు దశకు వస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సూచించడంతో మదుపర్ల సెంటిమెంట్ బలపడింది. దీంతో మార్కెట్లో కొనుగోళ్ల జోరు కనిపించింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1,264 పాయింట్లు లాభపడి 78,111.24 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 388.65 పాయింట్లు పెరిగి 24,231.30 వద్ద ముగిసింది. ట్రంప్ తాజా వ్యాఖ్యలతో ఇన్వెస్టర్ల సంపద రూ.10 లక్షల కోట్ల మేర పెరిగింది.

ఈ ర్యాలీ కేవలం హెవీవెయిట్ షేర్లకే పరిమితం కాలేదు. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా ప్రధాన సూచీలను మించి రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 2.20 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 2.35 శాతం మేర లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే, నిర్మాణ రంగ షేర్లు అత్యధికంగా లాభపడ్డాయి. ఐటీ, మీడియా రంగాల్లోనూ కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సూచీ మాత్రం వెనుకబడింది.

సాంకేతిక విశ్లేషకుల ప్రకారం, నిఫ్టీకి 24,300-24,400 స్థాయిలు కీలక నిరోధక జోన్‌గా ఉన్నాయి. ఈ స్థాయిని నిఫ్టీ బలంగా దాటితే 24,800-25,000 వైపు ర్యాలీ కొనసాగే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. కిందకు వస్తే, 24,000 వద్ద తక్షణ మద్దతు ఉండగా, 23,900-23,800 మధ్య బలమైన మద్దతు లభించవచ్చని తెలిపారు. మరోవైపు, అంతర్జాతీయ సానుకూల పరిణామాలతో రూపాయి కూడా బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 93.36 వద్ద ట్రేడ్ అయింది. గత రెండు రోజులుగా ముడిచమురు ధరలు తగ్గడం రూపాయికి కలిసివచ్చింది. బ్యారెల్ ధర 94-95 డాలర్ల శ్రేణికి దిగిరావడంతో భారత్ దిగుమతుల బిల్లుపై ఒత్తిడి తగ్గింది.

## చర్మ క్యాన్సర్ ముప్పును ముందే పసిగట్టనున్న ఏఐ...


**స్వీడన్ పరిశోధనలో వెల్లడి**

**ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్.. మరింత కచ్చితంగా, సమర్థంగా!**

**స్వీడన్‌లో 60 లక్షల మంది ఆరోగ్య డేటాను విశ్లేషించిన పరిశోధకులు**

**సాధారణ పద్ధతుల కన్నా ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలు ఇచ్చిందని వెల్లడి**

**హై-రిస్క్ గ్రూపులను గుర్తించడం ద్వారా వైద్య వనరులను సమర్థంగా వాడొచ్చన్న నిపుణులు**




**న్యూఢిల్లీ:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ప్రాణాంతక చర్మ క్యాన్సర్‌లలో ఒకటైన మెలనోమా ముప్పును ముందుగానే గుర్తించవచ్చని స్వీడన్‌లో జరిగిన ఒక కొత్త అధ్యయనం తేల్చింది. ఆరోగ్య వ్యవస్థల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని పరిశోధకులు బుధవారం వెల్లడించారు.

ఈ అధ్యయనం కోసం స్వీడన్‌లోని దాదాపు 60 లక్షల మంది వయోజన జనాభాకు సంబంధించిన ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. వారి వయసు, లింగం, గత ఆరోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, సామాజిక, ఆర్థిక స్థితి వంటి వివరాలను ఏఐ ద్వారా విశ్లేషించారు. ఐదేళ్ల అధ్యయన కాలంలో వీరిలో 38,582 మంది (0.64 శాతం) మెలనోమా బారిన పడినట్టు గుర్తించారు.

కేవలం వయసు, లింగం ఆధారంగా మెలనోమాను అంచనా వేసే పద్ధతితో పోలిస్తే, ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలను ఇచ్చింది. సాధారణ పద్ధతిలో 64 శాతం కచ్చితత్వం ఉండగా, అధునాతన ఏఐ మోడల్ సుమారు 73 శాతం కేసుల్లో మెలనోమా వచ్చే వారిని, రాని వారిని వేరు చేయగలిగింది. అంతేకాకుండా, ఐదేళ్లలో మెలనోమా వచ్చే ప్రమాదం 33 శాతం వరకు ఉన్న హై-రిస్క్ గ్రూపులను కూడా ఈ ఏఐ మోడల్ గుర్తించడం విశేషం.

## టీసీఎస్‌లో మత మార్పిడి కలకలం..

**వెలుగులోకి విస్తుపోయే నిజాలు!**

**కుట్ర కోసం వాట్సాప్ గ్రూప్ నడిపినట్లు గుర్తించిన అధికారులు**




**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నాసిక్ బ్రాంచ్‌లో మత మార్పిడి, లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. కొత్తగా చేరిన ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని ఓ ముఠా ఈ కార్యకలాపాలు సాగిస్తోందన్న ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి హెచ్‌ఆర్ మేనేజర్‌తో సహా ఏడుగురిని అరెస్ట్ చేశారు. నిందితులు ఒక పక్కా ప్రణాళికతో ఈ కుట్రను నడిపినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

పోలీసుల దర్యాప్తు ప్రకారం... నిందితులు శిక్షణా బృందంలో సభ్యులుగా ఉంటూ కొత్తగా చేరిన ఉద్యోగుల వివరాలు సేకరించేవారు. ఆర్థికంగా బలహీనంగా ఉన్న, కుటుంబ సమస్యలు ఎదుర్కొంటున్న వారిని లక్ష్యంగా చేసుకునేవారు. శిక్షణా సమయంలో హిందూ దేవుళ్లు, దేవతలపై కించపరిచేలా వ్యాఖ్యలు చేసి, వారిని మానసికంగా కలవరపరిచేవారు. ఆ తర్వాత, నిందితుల్లో ఒకరైన హెచ్‌ఆర్ మేనేజర్ నిదా ఖాన్ బాధిత ఉద్యోగులను సంప్రదించి, సానుభూతి నటిస్తూ వారి నమ్మకాన్ని చూరగొనేవారు. క్రమంగా వారి జీవనశైలి, ఆహార్యం మార్చుకునేలా ప్రేరేపించేవారని తేలింది. వీరి ప్రభావంతో ఓ మహిళా ఉద్యోగి తన కుటుంబంతో గొడవపడి, ఇంట్లో ఉన్న దేవుడి ఫొటోలను తొలగించినట్లు అధికారులు గుర్తించారు.

# కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్..

**ఆర్సీబీకి మరో గెలుపు**

**లక్నోపై 5 వికెట్ల తేడాతో ఆర్సీబీ ఘన విజయం**

**నాలుగు వికెట్లతో చెలరేగిన యువ బౌలర్ రసిఖ్ సలామ్ దార్**

**146 పరుగులకే కుప్పకూలిన లక్నో సూపర్ జెయింట్స్**

**49 పరుగులతో రాణించిన విరాట్ కోహ్లీ**

**15.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించిన బెంగళూరు**





**బెంగళూరు:** ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తోంది. సొంత మైదానం చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) జట్టుపై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బౌలర్లు సమష్టిగా రాణించి లక్నోను తక్కువ స్కోరుకే కట్టడి చేయగా, బ్యాటర్లు సమర్థంగా లక్ష్యాన్ని ఛేదించారు.

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న ఆర్సీబీకి బౌలర్లు శుభారంభం ఇచ్చారు. క్రమం తప్పకుండా వికెట్లు తీస్తూ లక్నో బ్యాటింగ్ లైనప్‌పై ఒత్తిడి పెంచారు. ఫలితంగా లక్నో జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 146 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులో మిచెల్ మార్ష్ (40), ఆయుష్ బదోని (38), ముకుల్ చౌదరి (39) మినహా మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ఆర్సీబీ బౌలర్లలో యువ పేసర్ రసిఖ్ సలామ్ దార్ 24 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి లక్నో పతనాన్ని శాసించాడు. భువనేశ్వర్ కుమార్ 3 వికెట్లతో రాణించాడు.

అనంతరం 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీకి విరాట్ కోహ్లీ (34 బంతుల్లో 49) గట్టి పునాది వేశాడు. కేవలం ఒక్క పరుగుతో అర్ధశతకం చేజార్చుకున్నప్పటికీ, జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఆ తర్వాత కెప్టెన్ రజత్ పటీదార్ (13 బంతుల్లో 27), జితేశ్ శర్మ (9 బంతుల్లో 23) మెరుపు ఇన్నింగ్స్‌లతో విరుచుకుపడటంతో ఆర్సీబీ 15.1 ఓవర్లలోనే 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది. లక్నో బౌలర్లలో ప్రిన్స్ యాదవ్ 3, అవేష్ ఖాన్ 2 వికెట్లు తీశారు.

## రోహిత్ శర్మ హెల్త్ రిపోర్ట్..

**ఆడే విషయంలో తుది నిర్ణయాన్ని రోహిత్ శర్మకే వదిలేసిన మేనేజ్మెంట్!**

**గత ఆదివారం ఆర్సీబీతో మ్యాచ్ సందర్భంగా గాయపడ్డ రోహిత్**

**కండరాలకు తీవ్ర గాయం లేనట్టుగా రిపోర్ట్**

**నేడు పంజాబ్ కింగ్స్‌తో ఆడటంపై అనుమానం**



**న్యూఢిల్లీ:** ఆదివారం ఐపీఎల్ లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ చేస్తుండగా స్టార్ బ్యాట్స్ మెన్ కుడి హ్యామ్‌స్ట్రింగ్ (ఝుఎర్‌తీఅఅస్త్ర) గాయానికి గురై, రిటైర్డ్ హర్ట్‌గా మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. తాజాగా రోహిత్ మెడికల్ రిపోర్టులు వెలువడ్డాయి.

ఆదివారం రాత్రి నిర్వహించిన ప్రాథమిక స్కాన్ రిపోర్ట్స్‌లో రోహిత్ కండరాలకు ఎలాంటి తీవ్రమైన గాయం లేదా చీలిక ఉన్నట్లు ఆధారాలు లభించలేదు. ఇది ముంబై అభిమానులకు పెద్ద ఊరటనిచ్చే అంశం. అయితే, ఈ నివేదిక ఇంకా అసంపూర్తిగా ఉందని, కండరాల పట్టివేత లేదా ఇతర అంతర్గత సమస్యలను గుర్తించడానికి మరికొన్ని పరీక్షలు అవసరమని వైద్య బృందం భావిస్తోంది.

మరోవైపు, నిన్న జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్స్‌కు రోహిత్ శర్మ హాజరుకాలేదు. గాయం తీవ్రత పెరగకుండా జాగ్రత్తగా ఉండాలనే ఉద్దేశంతోనే ఆయన ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. రేపు వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్ తో జరగబోయే మ్యాచ్‌లో రోహిత్ ఆడటంపై ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. రోహిత్ ప్రాముఖ్యత దృష్ట్యా, పంజాబ్ మ్యాచ్‌లో ఆయనను ఆడించి రిస్క్ తీసుకోవడం కంటే, విశ్రాంతినివ్వడమే ఉత్తమమని మేనేజ్మెంట్ భావిస్తోంది.

అయితే, తాజా సమాచారం ప్రకారం, ఈ మ్యాచ్‌లో ఆడాలా? వద్దా? అనే దానిపై తుది నిర్ణయాన్ని మేనేజ్మెంట్ రోహిత్ శర్మకే వదిలేసింది. పూర్తి రిపోర్టులు వచ్చిన తర్వాత రోహిత్ తన శారీరక ఫిట్‌నెస్‌ను బట్టి నిర్ణయం తీసుకోవచ్చని సమాచారం. ఈ ఐపీఎల్ సీజన్‌లో రోహిత్ శర్మ ఇప్పటివరకు 4 మ్యాచ్‌ల్లో 137 పరుగులు చేశాడు. కేకేఆర్‌పై 78 పరుగులతో అద్భుత ఫామ్‌లో ఉన్న రోహిత్, కీలకమైన సమయంలో గాయపడటం ముంబై జట్టుకు కొంత ఆందోళన కలిగించే విషయమే.

## అజింక్య రహానేకు 12 లక్షల జరిమానా



**చెన్నై:** కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజింక్య రహానేకు ఫైన్ పడింది. అతనికి 12 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో మంగళవారం చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా అతనికి ఫైన్ వేశారు. ఈ సీజన్‌లో కోల్‌కతా పర్ఫార్మెన్స్ మరీ దారుణంగా ఉంది. ఇప్పటి వరకు ఆ జట్టు ఒక్క మ్యాచ్ కూడా గెలవలేదు. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో 32 రన్స్ తేడాతో కోల్‌కతా ఓటమి పాలైంది. టాటా ఐపీఎల్‌లో భాగంగా జరిగిన 22వ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా రహానేకు ఫైన్ వేసినట్లు ఐపీఎల్ మీడియా అడ్వైజరీ ఓ ప్రకటనలో చెప్పింది. ఈ సీజన్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద తొలిసారి నేరంగా పరిగణిస్తూ ఆ ఫైన్ వేసినట్లు చెప్పారు. శుక్రవారం గుజరాత్ టైటాన్స్‌తో తన తదుపరి మ్యాచ్ కోల్‌కతా ఆడనున్నది.


## లాహోర్ దాడి ఘటన..ఇప్పటికీ తన శరీరంలో దాడి తాలూకు శకలాలు ఉన్నాయన్న సంగక్కర

**లాహోర్ దాడి ఘటనపై 17 ఏళ్ల తర్వాత స్పందించిన సంగక్కర**

**బాంబు పేలితే బాగుండని సహచర ఆటగాడి జోక్.. నిమిషంలోనే దాడి**

**శ్రీలంక అంతర్యుద్ధం ముందు తమ అనుభవం చాలా చిన్నదని వెల్లడి**

**'మేము దాని కోసమే సైన్యంలో చేరాం' అన్న సైనికుడి మాటలు కదిలించాయని వ్యాఖ్య**



**శ్రీలంక:** శ్రీలంక క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ కుమార సంగక్కర.. 17 ఏళ్ల క్రితం తమ జట్టుపై జరిగిన ఉగ్రదాడిని గుర్తుచేసుకుంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. 2009లో లాహోర్‌లో పాకిస్థాన్‌తో టెస్ట్ మ్యాచ్ సందర్భంగా జరిగిన ఆ భయానక దాడి తన జీవిత దృక్పథాన్నే పూర్తిగా మార్చేసిందని ఆయన భావోద్వేగంగా వెల్లడించారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ ఆయన ఆనాటి భయానక క్షణాలను పంచుకున్నారు.

2009 మార్చి 3న లాహోర్‌లోని గడ్డాఫీ స్టేడియం సమీపంలో శ్రీలంక జట్టు బస్సుపై ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో 8 మంది ప్రాణాలు కోల్పోగా, సంగక్కర, అజంతా మెండిస్, తిలాన్ సమరవీర సహా పలువురు శ్రీలంక ఆటగాళ్లు గాయపడ్డారు. ఈ దాడి కారణంగా పాకిస్థాన్‌లో చాలా ఏళ్లపాటు అంతర్జాతీయ క్రికెట్ నిలిచిపోయింది.

దాడికి ముందు జరిగిన ఓ సంఘటనను సంగక్కర గుర్తుచేసుకున్నాడు. "మేము మ్యాచ్ మూడో రోజు గ్రౌండ్‌కు బయలుదేరాం. బస్సులో ముందు సీట్లో కూర్చున్న ఓ ఫాస్ట్ బౌలర్, 'ఈ ఫ్లాట్ పిచ్‌లపై బౌలింగ్ చేసి నా నడుం విరిగిపోతోంది. ఓ బాంబు పేలితే హాయిగా ఇంటికి వెళ్లిపోవచ్చు' అని సరదాగా అన్నాడు. ఆ మాట అన్న నిమిషం కూడా గడవకముందే మా బస్సుపై దాడి జరిగింది" అని సంగక్కర తెలిపాడు.

ఆ దాడిలో తాను గాయపడ్డానని, ఇప్పటికీ తన కుడి వైపు శరీరంలో శ్రాప్‌నెల్ (తుపాకీ గుళ్ల శకలాలు) ఉందని సంగక్కర వెల్లడించారు. "నాకు ఎప్పుడూ పీడకలలు రాలేదు. కానీ, ఆ ఘటన శ్రీలంకలో అప్పుడు జరుగుతున్న అంతర్యుద్ధ పరిస్థితులపై నాకు గొప్ప అవగాహనను, కృతజ్ఞతాభావాన్ని ఇచ్చింది. మాకు కేవలం రెండు నిమిషాల పాటు ఆ భయానక అనుభవం ఎదురైతేనే అది ప్రపంచవ్యాప్తంగా పెద్ద వార్త అయింది" అని అన్నాడు.

కొన్ని వారాల తర్వాత కొలంబోలో జరిగిన ఓ సంఘటన తనను మరింతగా కదిలించిందని సంగక్కర వివరించారు. "నేను కారులో వెళ్తుండగా ఓ సైనికుడు ఆపి, 'మీకు అలా జరిగినందుకు చాలా బాధపడ్డాం' అన్నాడు. 'ఇలాంటివి మీకు, మీ సైనికులకు రోజూ జరుగుతాయి కదా' అని నేను బదులిచ్చాను. దానికి ఆ సైనికుడు, 'అవును, కానీ మేము దానికోసమే సైన్యంలో చేరాం' అని చెప్పాడు. ఆ మాటలతో నేను నిశ్చేష్టుడనయ్యాను. డబ్బు తీసుకుని మేం ఆడేది ఒక ఆట. రెండు నిమిషాల అనుభవానికే మమ్మల్ని హీరోలుగా చూశారు. కానీ, 26 ఏళ్లుగా ఆ నరకాన్ని అనుభవించిన ప్రజలు, సైనికుల గురించి ఆలోచించాను. ఆ క్షణం నాలో అపారమైన మార్పు తీసుకొచ్చింది" అని సంగక్కర తెలిపాడు.

## కృష్ణావతారం మూవీ
# ట్రైలర్ విడుదల



**టాకీస్:** మధురలోని అత్యంత పవిత్రమైన శ్రీ కృష్ణ జన్మభూమి వేదికగా 'కృష్ణావతారం' చిత్ర ట్రైలర్ గ్రాండ్‌గా విడుదలైంది. పవిత్ర పుణ్యక్షేత్రంలో వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగిన ఈ వేడుకతో సినిమాపై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు హార్దిక్ గజ్జర్ విజువల్ వండర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రంలో శ్రీకృష్ణుడి పాత్రలో సిద్ధార్థ్ గుప్తా నటిస్తుండగా, రాధగా సుష్మిత భట్, సత్యభామగా సంస్కృతి జయాన, రుక్మిణిగా నివాషిని కృష్ణన్ కనిపించబోతున్నారు. క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ ఎంటర్‌టైన్‌మెంట్ మరియు అథశ్రీకథ మోషన్ పిక్చర్స్ పతాకాలపై సజన్ రాజ్ కురుప్, శోభా సంత్, పూనమ్ ష్రాఫ్, పార్థ్ గజ్జర్ ఈ భారీ పౌరాణిక చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రకాష్ కపాడియా, రామ్ మోరి, హార్దిక్ గజ్జర్ స్క్రీన్‌ప్లే అందించగా, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ అయనక బోస్ అద్భుతమైన విజువల్స్ అందించారు. మొత్తం మూడు భాగాలుగా రాబోతున్న ఈ సినిమా మొదటి అధ్యాయం మే 7, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## సర్ మరో అవకాశం
# ఇవ్వండి
### బుచ్చిబాబు పోస్ట్.. వైరల్



**టాకీస్:** ప్రస్తుతం అగ్ర కథానాయకుడు రామ్ చరణ్ పెద్దితో బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రానున్న ఈ సినిమా ఏప్రిల్ 30న విడుదల కానుంది. వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా రామ్‌చరణ్ 'ఎస్క్వైర్ ఇండియా' కు ఇంటర్వ్యూ ఇచ్చిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. ఈ ఫోటోల్లో చరణ్ స్టైలిష్ లుక్‌కు అభిమానులు ఫిదా అవుతున్నారు. దీనికి దర్శకుడు బుచ్చిబాబు చేసిన కామెంట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 'సర్.. మరో అవకాశం ఇవ్వండి' అని సరదాగా కామెంట్ చేశారు. ఈ చిన్న కామెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. దీంతో 'పెద్ది' తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో మరో సినిమా రానుందని వార్తలు మొదలయ్యాయి. గ్యాంగ్‌స్టర్ సినిమా తీయమంటూ అభిమానులు కూడా రిప్లైలు పెడుతున్నారు. ప్రస్తుతం ఈ ఇద్దరూ పెద్దిపై పూర్తి ఫోకస్ పెట్టారు. ఇప్పటివరకూ విడుదలైన ఈ సినిమాలోని పాటలు ఆదరణను సొంతం చేసుకోవడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.




# క్రమ-శిక్షణే అసలైన బలం
### సాన్యా మల్హోత్రా

టాకీస్: గ్లామర్ ప్రపంచంలో షూటింగ్‌లు, ప్రయాణాలతో సమయం దొరకడమే కష్టంగా ఉంటుంది. అటువంటి బిజీ షెడ్యూల్‌లో కూడా సాన్యా మల్హోత్రా తన వర్కవుట్‌ను ఎలా మేనేజ్ చేస్తోంది? ఆమె ఫిట్‌నెస్ రహస్యం ఏంటి? అనే విషయాలను ఆమె ట్రైనర్ త్రిదేవ్ పాండే తాజాగా వెల్లడించారు. సాన్యా ఫిట్‌నెస్ మైండ్‌సెట్ ప్రతి ఒక్కరికీ ఒక పాఠం అని ఆయన ప్రశంసించారు. సామాజిక మాధ్యమాల్లో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే సాన్యా, తన వర్కవుట్ వీడియోలను తరచుగా షేర్ చేస్తూ ఫాలోవర్లలో ఉత్సాహాన్ని నింపుతుంటుంది.చాలామందికి వర్కవుట్ అంటే కేవలం జిమ్‌కి వెళ్లడం మాత్రమే. కానీ సాన్యా విషయంలో అది ఒక జీవనశైలి. షూటింగ్ ఎంత ఆలస్యమైనా, షెడ్యూల్ ఎంత కఠినంగా ఉన్నా ఆమె తన వ్యాయామాన్ని వదులుకోదు. "సాన్యా లాంటి మైండ్‌సెట్ గనుక మీకు వస్తే, మీరు ఫిట్‌గా ఉండటాన్ని ఎవరూ ఆపలేరు" అని త్రిదేవ్ పాండే ఒక ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో పేర్కొన్నారు. ఫిట్‌నెస్ అనేది కేవలం శరీరానికి సంబంధించింది మాత్రమే కాదు, అది మెదడు యొక్క సంకల్ప బలం మీద ఆధారపడి ఉంటుందని సాన్యా నిరూపిస్తోంది. సాధారణంగా ప్రజలు ఏదైనా పని ఉంటే వర్కవుట్‌ను వాయిదా వేస్తుంటారు. కానీ సాన్యా మాత్రం వర్కవుట్‌ను తన దైనందిన జీవితంలో బ్రష్ చేసుకోవడం, స్నానం చేయడం లాంటి ఒక ముఖ్యమైన పనిగా మార్చుకుంది. ఈ నిలకడ వల్లే ఆమె సంవత్సరాల తరబడి తన అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతోంది. ఆమె వర్కవుట్లలో యోగా, స్ట్రెంగ్త్ ట్రైనింగ్ మరియు డ్యాన్స్ వంటివి కలగలిసి ఉంటాయి, దీనివల్ల బోర్ కొట్టకుండా వ్యాయామాన్ని ఆస్వాదించవచ్చు. బిజీగా ఉన్నామని సాకులు వెతకడం మానేసి, మనకు ఉన్న సమయంలోనే కనీసం కొద్దిసేపైనా శరీరాన్ని కదిలించడం వల్ల అద్భుతమైన ఫలితాలు ఉంటాయి. సాన్యా మల్హోత్రా ఫిట్‌నెస్ జర్నీ చూస్తే, ఆరోగ్యం పట్ల ఆమెకు ఉన్న అంకితభావం స్పష్టంగా కనిపిస్తుంది.

**టాకీస్:** రాజమౌళి సృష్టించిన 'బాహుబలి' మరో ఘనతను సొంతం చేసుకుంది. ఆయన రూపొందించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న సరికొత్త యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ద ఎటర్నల్ వార్' . 2027లో ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. తాజాగా ఈ చిత్రం ఒక అరుదైన మైలురాయిని చేరుకుంది. ఫ్రాన్స్‌లో జరగనున్న ప్రతిష్టాత్మక ఎన్నేసి యానిమేషన్ ఫెస్టివల్ 2026 లోని 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' విభాగంలో ప్రదర్శనకు అధికారికంగా ఎంపికైంది. దీనిపై రాజమౌళి ఆనందం వ్యక్తంచేశారు. యానిమేషన్ అనేది హద్దులు లేని అద్భుతమైన ప్రపంచమనే విషయాన్ని నేను ఎప్పుడూ నమ్ముతానని ఈ సందర్భంగా అన్నారు. ఇది మన భారతీయ సినిమాకి దక్కిన ఒక అరుదైన గౌరవంగా భావిస్తున్నా. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన

## ఫ్రాన్స్ యానిమేషన్ ఫెస్టివల్‌లో యానిమేషన్
# బాహుబలి
### భారతీయ చిత్ర పరిశ్రమకు దక్కిన గుర్తింపు అన్న రాజమౌళి



యానిమేషన్ వేదికపై ఈ సినిమాను ప్రదర్శించే అవకాశం రావడం మాకెంతో ఆనందంగా ఉంది. దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం అని రాజమౌళి పోస్ట్ పెట్టారు. యానిమేషన్ రంగంలో ఈ ఫెస్టివల్‌ను 'యానిమేషన్ ప్రపంచపు కేన్స్ ఫెస్టివల్'గా పరిగణిస్తారు. భారతీయ యానిమేషన్ సత్తాను ప్రపంచ వేదికపై చాటిచెప్పేందుకు ఇదొక గొప్ప అవకాశంగా సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అమరేంద్ర బాహుబలి మరణం తర్వాత జరిగే పరిణామాల నేపథ్యంలో దీన్ని రూపొందిస్తున్నారు. దాదాపు రూ.120 కోట్ల భారీ బడ్జెట్‌తో 'ఆర్కా మీడియా వర్క్స్' ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది.

# 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ మూవీ కాదు
### నటుడు యశ్ ఆసక్తికర విషయం వెల్లడి

టాకీస్: భిన్న నేపథ్యాలున్న కథలతో పలకరించేందుకు సిద్ధమయ్యారు నటుడు యశ్. ప్రస్తుతం నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న 'రామాయణ'లోనటిస్తున్నారు. దీనితో పాటు.. గీతూ మోహన్ దాస్ డైరెక్షన్‌లో 'టాక్సిక్' చేస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ రెండు సినిమాల గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'టాక్సిక్' టీజర్ చూసి అందరూ ఇది గ్యాంగ్‌స్టర్ సినిమా అనుకుంటున్నారని కానీ, ఇది అలాంటి చిత్రం కాదని స్పష్టం చేశారు. జూన్ 4న విడుదల కానున్న 'టాక్సిక్' గురించి యశ్ మాట్లాడుతూ.. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ సినిమా కాదు. ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోంది. భిన్నమైన ప్రపంచం.. కొత్త కథాంశంతో రానుంది. ఆకట్టుకునే విజువల్స్ ఉన్నాయి. మొదటిసారి ఒక సినిమాను ఇంగ్లిష్‌లో కూడా తెరకెక్కిస్తున్నారు. టీమ్ అంతా ఎంతో ఉత్సాహంగా పని చేస్తోంది. నా అభిమానులు నా నుంచి ఏం ఆశిస్తున్నారో నాకు తెలుసు. అందుకే ప్రతి చిన్న విషయంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. కచ్చితంగా ఇది మిమ్మల్ని అలరిస్తుంది. దర్శకురాలు గీతూ




మోహన్ దాస్‌తో పనిచేయడం చాలా గొప్ప అనుభవం. సినిమాపై స్పష్టమైన విజన్‌తో ఉన్నారు. యాక్షన్ మాత్రమే కాకుండా, బలమైన భావోద్వేగాలు కూడా ఈ సినిమాలో ఉంటాయని చెప్పారు. ఇక 'రామాయణ' మొదటి భాగం గురించి యశ్ పంచుకున్నారు. 'రణ్‌బీర్ అద్భుతమైన నటుడు. సినిమా విషయంలో మా ఇద్దరి విజన్, ఆలోచనలు ఒకేలా ఉన్నాయి.

# వారణాసి కోసం దేవర సెట్స్ ?

టాకీస్: సూపర్‌స్టార్ మహేష్ బాబు మరియు దర్శక ధీరుడు రాజమౌళి కాంబినేషన్‌లో రాబోతున్న 'వారణాసి' సినిమాపై రోజురోజుకు అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన అప్‌డేట్ ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం వారణాసి టీమ్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర' సినిమా కోసం వాడిన టెక్నికల్ బ్యాక్‌డ్రాప్‌ను ప్రత్యేకంగా అండర్ వాటర్/వాటర్ సెట్స్ వినియోగించబోతున్నట్లు తెలుస్తుంది. 'దేవర' సినిమాలోని సముద్రపు సన్నివేశాల కోసం హైదరాబాద్‌లోని శంషాబాద్ వద్ద భారీ వాటర్ ట్యాంక్ సెట్‌ను, బ్లూ మ్యాట్ టెక్నాలజీతో రూపొందించారు. ఇప్పుడు అదే సెట్‌ను 'వారణాసి'లో గంగా నది నేపథ్యంలో వచ్చే కీలక సన్నివేశాల కోసం రీ-డిజైన్ చేసి వాడుతున్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ షెడ్యూల్ విదేశాల్లో జరగాల్సి ఉంది. కానీ ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో నెలకొన్న ఉద్రిక్తతల వల్ల అంతర్జాతీయ ప్రయాణాలు రిస్క్ అని భావించిన రాజమౌళి, తెలివిగా ప్లాన్ మార్చి హైదరాబాద్‌లోనే షూటింగ్ కొనసాగిస్తున్నారు. ఈ సెట్‌లో మహేష్ బాబుపై భారీ రివర్ ఛేజ్ మరియు కొన్ని హై-టెక్ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. 'దేవర'లో వాడిన అడ్వాన్స్‌డ్ సినిమాటోగ్రఫీ టెక్నిక్స్ మరియు



వాటర్ షూట్ ఎక్స్‌పర్టీస్‌ను ఈ షెడ్యూల్ కోసం ఉపయోగిస్తున్నట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.